PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 209 | విజయవాడ, సోమవారం 4 మార్చి 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 4 March 2024 | Rs

జిందాల్‌తో బతుకులు బుగ్గి

- నిర్వాసితుల గోడు
- 18 ఏళ్లు గడిచినా ఏర్పాటు కాని కంపెనీ
- భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్

● లోపలి పేజీలో..●

నేటి నుంచి వెబ్‌సైట్‌లో టెన్త్ హాల్ టికెట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదోతరగతి పరీక్షల విద్యార్థుల హాల్ టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో పొందుపరచనుంది. సోమవారం మధ్యాహ్నం 12 నుంచి విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టరు డి దేవానందరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాలల్లో లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వెల్లడించారు. స్కూల్ కోడ్, పాస్‌వర్డ్, విద్యార్థి పుట్టిన రోజు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 18 నుంచి 30 వరకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు.



రెండవసారి పాక్ ప్రధానిగా షెహబాజ్

- నేడు ప్రమాణస్వీకారం

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ 24వ ప్రధానిగా షెహబాజ్ షరీఫ్ ఆదివారం ఎన్నికయ్యారు. సంక్షోభంలో ఉన్న పాకిస్తాన్ నావను మిత్ర పక్షాల సహాయంతో ఒడ్డుకు చేరుస్తానని పాక్ ప్రధానిగా ఎన్నికైన వెంటనే చేసిన ప్రసంగంలో షెహబాజ్ పేర్కొన్నారు. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి), పాకిస్థాన్ ముస్లిం లీగ్ -నవాజ్ (పిఎంఎల్-ఎన్) పార్టీల సంకీర్ణ ప్రభుత్వానికి రెండో పర్యాయం ఆయన నేతృత్వం వహించనున్నారు. పార్లమెంటులో నిర్వహించిన ప్రధాని ఎన్నికలో షెహబాజ్ తన ప్రత్యర్థి పిటిఐ మద్దతు కలిగిన ఒమర్ అయూబ్ ఖాన్‌పై విజయం సాధించారు. షెహబాజ్‌కు 201 ఓట్లు రాగా, అయూబ్ ఖాన్‌కు 92 ఓట్లు వచ్చాయి. షహబాజ్ ప్రధానిగా సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. షెహబాజ్ 2022 ఏప్రిల్ నుండి ఆగస్టు 2023 వరకు మొదటి సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. షెహబాజ్ ప్రధానిగా ఎన్నికైనట్లు పాక్ జాతీయ అసెంబ్లీ (పార్లమెంటు) స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిఖ్ ప్రకటించిన వెంటనే ఆయన తన సోదరుడు పాకిస్తాన్ ముస్లింలీగ్ (ఎన్) నేత నవాజ్ షరీఫ్‌ను ఆలింగనం చేసుకున్నారు. పాకిస్తాన్‌ను రుణ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు మేధావులు, జర్నలిస్టులు, రాజకీయ నాయకులు, మత పెద్దలతో సహా అందరి సలహాలు తీసుకుని పాక్ నావను ఒడ్డుకు చేరుస్తానని అన్నారు. విద్యుత్, పన్నుల చౌర్యాన్ని అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటానని ఆయన చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి రెండోసారి సభా నాయకుడిగా ఎన్నుకున్నందుకు తన సోదరుడికి, మిత్ర పక్షాలకు షెహబాజ్ కృతజ్ఞతలు తెలిపారు.



పాట్నాలో 'ఇండియా' ఫోరం ఆదివారం నిర్వహించిన జన విశ్వాస్ ర్యాలీకి పెద్దయెత్తున తరలివచ్చిన అశేష జనవాహిని

రాజ్యాంగ భక్షకులారా ఖబడ్దార్!

- పాట్నా 'జన్ విశ్వాస్' ర్యాలీలో 'ఇండియా' ఫోరం నేతల హెచ్చరిక
- మోడీ హిందువే కాదన్న లాలూ
- బిజెపిపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించిన ఖర్గే, తేజస్వి, అఖిలేష్, ఏచూరి తదితరులు

రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్న కేంద్రంలోని నిరంకుశ పాలకులారా ఖబడ్దార్ అంటూ ఇండియా ఫోరం నేతలు గర్జించారు. పార్లమెంటు ఎన్నికలకు ముందు జన విశ్వాస్ ర్యాలీ పేరుతో బీహార్‌లోని పాట్నా వేదికగా ఇండియా ఫోరం ఆదివారం బ్రహ్మాండమైన సభ నిర్వహించింది. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాజ్యాంగ రక్షకులకు, భక్షకులకు మధ్యే పోటీ అని వక్తలు ఉద్ఘాటించారు. జెడి(యు) నేత నితీష్ ఎన్డీయేలోకి ఫిరాయించిన తరువాత బీహార్‌లో మహాఘట్‌బంధన్ నిర్వహించిన తొలి ర్యాలీ ఇది. సన్నగా జల్లులు కురిసినప్పటికీ మైదానం నుంచి ఒక్కరు కూడా కదలకుండా నేతల ప్రసంగాలను జనం శ్రద్ధగా ఆలకించారు. ఈ ర్యాలీలో లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన తనయుడు తేజస్వి యాదవ్‌తో సహా ఇండియా ఫోరం అగ్రనేతలు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్, సిపిఐఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొని బిజెపిపై పదునైన విమర్శనాస్త్రాలు సంధించారు.

- పూర్తి కథనం 5లో..

భగభగలు మొదలు

- మార్చి ప్రారంభంలోనే చుక్కలు చూపుతున్న భానుడు
- ఆదివారం పలు చోట్ల 39 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-అమరావతి

తెలుగు రాష్ట్రాల్లో ఎండ తీవ్రత పెరిగింది. మార్చి నెల ప్రారంభంలోనే భానుడు భగభగ మండిపోతున్నాడు. ఐదు రోజుల క్రితం 33.6 డిగ్రీలున్న ఎండ.. ప్రస్తుతం ప్రతిరోజూ 35 డిగ్రీల కంటే ఎక్కువ ఉండటంతో నగర వాసులు ఇబ్బంది పడుతున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరుగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

విజయవాడలో ఆదివారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇటు తెలంగాణలోనూ అత్యధికంగా సిద్దిపేట, ములుగు, వనపర్తి జిల్లాల్లో 39 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మరోవైపు రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతున్నాయి. గురువారం వరకు ఎండల తీవ్రత కొనసాగే సూచనలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించింది. ఈ వేసవిలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఒకవైపు ఎండలు.. మరోవైపు వడగాల్పులతో మధ్యాహ్నం అయిందంటే ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. 38 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదవ్వగా.. ఉక్కపోత ఎక్కువైంది. ఎండల నుంచి ఉపశమనం పొందడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

14న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

- రైతు సంఘాల సమన్వయ సమితి

● లోపలి పేజీలో..●

ఆయిల్‌పామ్ వైపు మొగ్గు!

- ఏడాదిలో 23 వేల ఎకరాల్లో పెరిగిన సాగు
- ధర నిలకడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండగా నిలబడాలంటున్న రైతులు



నిండు జీవితానికి రెండు చుక్కలు

దేశవ్యాప్తంగా పల్స్ పోలియో ప్రారంభం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ, అమరావతి బ్యూరో



పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

దేశాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. దీనికిగాను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లోనూ ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కల మందు వేశారు. రాష్ట్రంలోనూ పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైంది. రాజ్‌భవన్‌లో గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన సతీమణి, రాష్ట్ర ప్రథమ మహిళ సమీరా నజీర్.. చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు జె నివాస్, జెడి (సిహెచ్ అండ్ఐ) కె అర్జున్‌రావు, స్టేట్ ఇమ్యునైజేషన్ అధికారి పిఏ ఎల్‌పిహెచ్ఎస్ దేవి, ఎన్‌టిఆర్ జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుహాసిని, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎంహెచ్ఒ బాబు శ్రీనివాస్, డిఐఎ అమృత పాల్గొన్నారు. జిల్లా కేంద్రాల్లో మంత్రులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో మొత్తం 53.35 లక్షల మంది ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు తెలిపారు.

ఊరట ఇవ్వని ఆఖరి కేబినెట్

- సంక్షేమం ఊసేలేని సుదీర్ఘ భేటీ
- ఉపదేశాలు,ప్రగల్భాలతో సరి

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆదివారం జరిగిన కేబినెట్ సమావేశం కనీస మద్దతు ధర కోసం ఉద్యమిస్తున్న రైతులకు కానీ, అధిక ధరలతో విలవిలలాడుతున్న సామాన్యుడికి కానీ, ఉద్యోగాల భర్తీ కోసం ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న యువతకు కానీ ఊరట కల్పించే ఎలాంటి నిర్ణయమూ చేయలేదు. కేబినెట్ చరిత్రలోనే అతి సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశం రానున్న ఎన్నికల్లో విజయం తమదేనని మంత్రుల్లో నమ్మకం కలిగించడానికి, 2047లో భారత్ దివ్యంగా వెలిగిపోతుందని చెప్పడం కోసమే ఉద్దేశించినట్లుగా ఉందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానించారు. ఇంతకుముందు జరిగిన కేబినెట్ సమావేశాలకు భిన్నంగా ఇది జరిగింది. ప్రజలెదుర్కొంటున్న సమస్యల గురించిన ఊసే లేదు. పైగా రెండు పర్యాయాలు అధికారంలో ఉండి చేయలేనివి, మూడోసారి గెలిస్తే చేసేద్దామని ప్రగల్భాలు పలికారు. 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనకు సిద్ధంగా ఉండాలంటూ ఉపదేశాలిచ్చారు. కొన్ని రోజుల

మిగతా 5లో

బిజెపిలో గడబిడ

- పోటీ చేయబోనన్న భోజ్‌పురి స్టార్ పవన్‌సింగ్
- రాజకీయాల నుంచి తప్పుకున్న కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్



బిజెపి నేత భోజ్‌పురి గాయకుడు పవన్‌సింగ్

న్యూఢిల్లీ : బిజెపి అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించి 24 గంటలు తిరక్కముందే ఆ పార్టీలో గడబిడ మొదలైంది. భోజ్‌పురి నటుడు, గాయకుడు పవన్‌సింగ్ తాను ఎన్నికల్లో పోటీ చేయబోవడం లేదని తాజాగా ప్రకటించి పార్టీ నాయకత్వాన్ని ఇరకాటంలో పడేశారు. పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి పవన్‌సింగ్ పోటీ చేస్తారని శనివారం బిజెపి ప్రకటించిన సంగతి తెలిసిందే. 'కొన్ని కారణాల వల్ల నేను ఎన్నికల్లో పోటీ చేయలేను' అని ఆయన ఆదివారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బెంగాల్ మహిళలను లక్ష్యంగా చేసుకుని అసభ్యకరమైన, విద్వేషపూరిత వీడియోలు చేసినందుకు అసన్‌సోల్ సీటు బహుమతిగా ఇచ్చారంటూ సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే ఆయన పోటీచేయబోనని ప్రకటించినట్లు తెలిసింది. కేంద్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి, ఢిల్లీలోని ఛాందిని చౌక్ సిట్టింగ్ ఎంపి డాక్టర్ హర్షవర్ధన్‌ను నాయకత్వం విస్మరించడంతో క్రియాశీల రాజకీయాలనుంచి తప్పుకుంటున్నానని ఆయన ప్రకటించారు. బిజెపి శనివారం ప్రకటించిన 195 మంది ఎంపి అభ్యర్థుల తొలిజాబితాలో ఆయనకు చోటు దక్కలేదు. ఛాందిని చౌక్ నుంచి ప్రవీణ్ ఖండేల్‌వాల్ పోటీ చేస్తారని బిజెపి ప్రకటించింది. ఐదుసార్లు అసెంబ్లీకి, రెండు సార్లు పార్లమెంట్‌కు ఎన్నికయ్యానని ఆయన గుర్తు చేశారు. కృష్ణానగర్‌లోని తన ఇఎన్‌టి క్లినిక్ తన కోసం ఎదురుచూస్తోందంటూ పోస్ట్ చేశారు.

స్పెషల్ డిఎస్‌సిపై నిర్ణయం తీసుకోకుంటే..

10న మన్యం బంద్

- ఆదివాసీ సంఘాల పిలుపు

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9వ తేదీ నాటికి ఆర్డినెన్స్ జారీ చేయకుంటే 10న రాష్ట్ర వ్యాప్తంగా మన్యం బంద్ నిర్వహిస్తామని ఆదివాసీ ప్రజా సంఘాల రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం తెలిపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని గిరిజన సంఘం కార్యాలయంలో ఏజెన్సీ ప్రాంత డిఎస్‌సి సాధన కమిటీ, ఆదివాసీ గిరిజన సంఘం అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఎస్‌టి ఎంప్లాయీస్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నీలకంఠం, యుటిఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సిహెచ్.నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఆదివాసీ కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం ఉద్యోగాలను ఆదివాసీలకే ఇవ్వాలన్న జిఒ నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జనరల్ డిఎస్‌సి నోటిఫికేషన్‌లో షెడ్యూల్ ఏరియాలో 517 ఉపాధ్యాయ పోస్టులను నోటిఫై చేసి కేవలం 38 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఆదివాసీలకు కేటాయించడం దారుణమన్నారు. 1/70 చట్టం ఏజెన్సీలో ఉల్లంఘనకు గురవుతోందని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 3 చట్టబద్ధత కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఆదివాసీ వాల్మీకి, కొండ దొర తెగలను తొలగించడం అన్యాయమన్నారు. తక్షణమే పునరుద్ధరించాలని, మాతృభాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని, నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉన్న 1500 గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని కోరారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత డిఎస్‌సి సాధన కమిటీ కన్వీనర్ నరేష్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ, మాతృభాష ఉపాధ్యాయుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

10న దేశవ్యాప్తంగా రైల్ రోకో

- 6న ఢిల్లీలో ఆందోళనలు
- రైతు ఆందోళన కార్యాచరణ

5

బెంగళూరు పేలుళ్ల సూత్రధారి అరెస్ట్

- మైదుకూరులో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఎ బృందం



3

కూర్మన్నపాలెం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు, కార్మికులు



బిజెపిని ఓడిస్తేనే 'ఉక్కు'కు రక్షణ

- విశాఖలో మహాపాదయాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
- కూర్మన్నపాలెం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ

2

నలుగురు ఐపిఎస్‌ల బదిలీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మరోసారి ఐపిఎస్‌ల బదిలీ జరిగింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి ఆదివారం నలుగురు ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రకాశం జిల్లా నుంచి తిరుపతి జిల్లా ఎస్‌పిగా బదిలీ అయిన మల్లికా గార్గ్‌ను మూడు వారాలు కాకుండానే సిఐడి ఎస్‌పిగా బదిలీ చేశారు. విజయవాడలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా వున్న కృష్ణకాంత్ పటేల్‌ను తిరుపతి ఎస్‌పిగా పంపారు. అలాగే విజయనగరం జిల్లాలోని ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా వున్న అధిరాజ్ సింగ్‌ను విజయవాడ లా అండ్ ఆర్డర్ డిసిపిగా, విశాఖపట్నంలోని 16వ ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్ గౌతమిశాలినిని విజయనగరం ఐదో బెటాలియన్ కమాండెంట్‌గా అదనపు చార్జ్‌తో నియమించారు.

7న గుంటూరులో న్యాయసాధన సభ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ఈ నెల 7న ఇండియా వేదిక ఆధ్వర్యంలో న్యాయసాధన సభ నిర్వహిస్తున్నట్టు కేంద్ర మాజీ మంత్రి జె.డి.శీలం, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి తెలిపారు. గుంటూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు ఆదివారం మీడియాతో మాట్లాడారు. కర్ణాటక సిఎం సిద్దరామయ్య, పిసిసి అధ్యక్షులు షర్మిల, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు రఘువీరారెడ్డి, వామపక్షాలు, విసికె పార్టీల రాష్ట్ర నాయకులు సభలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర పునర్విభజన చట్టం హామీల అమలు, అమరావతి రాజధాని నిర్మాణం, ప్రత్యేక హోదా తదితర అంశాలపై ఈ సభ జరుగుతుందని తెలిపారు. వైసిపి, టిడిపి, జనసేన కేంద్రంలోని బిజెపికి మద్దతు పలుకుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించాయన్నారు. విభజన హామీలను పట్టించుకోకపోగా కనీసం కేంద్రాన్ని ప్రశ్నించడం లేదని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

బిసి డిక్లరేషన్ రూపకల్పనకు 19 మందితో కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

19 మందితో టిడిపి-జనసేన బిసి డిక్లరేషన్ కమిటీని ఆదివారం టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కమిటీలో టిడిపికి చెందిన యనమల రామకృష్ణుడు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, పితాని సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, కాల్వ శ్రీనివాసులు, బీదా రవిచంద్ర, అనగాని సత్యప్రసాద్, పంచుమర్తి అనురాధ, బండారు సత్యనారాయణమూర్తి, దువ్వారపు రామారావు, గౌతు శిరీష తదితరులు ఉన్నారు.

బిసిలను గాలికొదిలేసిన జగన్ :టిడిపి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో బిసిల అభివృద్ధిని గాలికొదిలేశారని టిడిపి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ఈ నెల 5న బిసి డిక్లరేషన్ ప్రకటించనున్నట్లు తెలిపారు.

ఎన్నికల తంతు పూర్తిచేసుకుని లండన్ పారిపోయేందుకు జగన్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని టిడిపి నేత దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ విశాఖలో రుషికొండను బోడిగుండు చేసి ఆ స్థానంలో రూ.500 కోట్ల ప్యాలెస్‌ను నిర్మించుకున్నారని తెలిపారు.





ప్రసంగిస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, విశాఖలో నిర్వహించిన మహాపాదయాత్ర

బిజెపిని ఓడిస్తేనే 'ఉక్కు'కు రక్షణ

- విశాఖలో మహాపాదయాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకం
- కూర్మన్నపాలెం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఉక్కునగరం విలేకరులు

కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో దానితో అంటకాగుతున్న పార్టీలను ఓడిస్తేనే ఉక్కు ప్లాంట్ పరిరక్షణ సాధ్యమవుతుందని విశాఖపట్టణంలో నిర్వహించిన మహాపాదయాత్రలో ప్రజానీకం ముక్తకంఠంతో నినదించింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ఆదివారం తలపెట్టిన మహా పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వేలాది పిడికిళ్లు ఉక్కు కోసం నినదించాయి. ఈ మహా పాదయాత్ర కూర్మన్నపాలెం కూడలిలోని ఉక్కు దీక్షా శిబిరం నుంచి ప్రారంభమై జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ సాగింది. వడ్లపూడి, శ్రీనగర్, పాత గాజువాక, ఎన్ఎడి, కంచరపాలెం మీదుగా సాగిన ఈ యాత్రకు ఎక్కడికక్కడ ప్రజలు ఎదురేగి పూలుజల్లి ఘన స్వాగతం పలికారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగిన సభలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయాలని చూస్తోన్న బిజెపిని, దానికి మద్దతు ఇస్తున్న పార్టీలను ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అందుకు పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. దేశ చరిత్రలోనే ఉక్కు పరిరక్షణ ఉద్యమం చిరస్థాయిలో నిలిచిపోతుందని తెలిపారు. చీలికలు సృష్టించి ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు బిజెపి చేస్తోన్న కుయుక్తులను పోరాట పటిమగల స్టీల్‌ప్లాంట్ కార్మికులు తిప్పికొట్టాలని కోరారు. రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపికి ఒక్క సీటు వచ్చినా స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు, ఉద్యమానికి హాని కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో బిజెపిని పూర్తిగా తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు పోరాటాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయాలని చూస్తోన్న బిజెపికి రానున్న ఎన్నికల్లో కార్మికులు, నిర్వాసితులు గట్టి బుద్ధి చెప్పాలని కోరారు. పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ కోసం కార్మిక వర్గం రాజకీయాలకు అతీతంగా పోరాడుతోందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో ఏ రాజకీయ పార్టీ పొత్తు పెట్టుకోరాదన్నారు. బిజెపిని ఒంటరి చేసి ఓడించడం ద్వారానే స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోగలమని తెలిపారు. సమిష్టి పోరాట ఫలితంగానే మోడీ ప్రభుత్వం ఇంతవరకూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మలేకపోయిందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడంలో విఫలమైందన్నారు. నవభారత నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ విషయమై తాను సిఎంతో మాట్లాడడానికి ప్రయత్నించినా అనుమతి ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు జెవి.సత్యనారాయణమూర్తి, టిడిపి విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఎం.శ్రీభరత్, జనసేన పార్టీ పిఎసి సభ్యులు కోన తాతారావు, కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి రాకేష్ రెడ్డి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరాం, సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాసరావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పలు రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. మహా పాద యాత్రకు విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైసిపి గాజువాక ఇన్‌ఛార్జి ఉరుకూటి చందు తదితరులు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 37,465 పల్స్ పోలియో కేంద్రాలు

- నేటి నుంచి ఇంటింటికీ మొబైల్ బృందాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా పల్స్ పోలియో చుక్కల పంపిణీ కోసం ప్రభుత్వం 37,465 ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేంద్రాలతో పాటు ఇంటింటి సందర్శన కోసం 74,390 బృందాలను, 1693 మొబైల్ టీమ్‌లను హై రిస్క్ ప్రాంతాల్లో నియమించినట్లు పేర్కొంది. మొత్తం మీద ఈ కార్యక్రమ నిర్వహణ కోసం 1,55,420 మంది వ్యాక్సినేటర్లను, 4,116 మంది సూపర్ వైజర్లను ప్రభుత్వం నియమించినట్లు తెలిపింది. లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా 67,76,100 డోస్‌ల పల్స్ పోలియో వ్యాక్సిన్‌ను అన్ని జిల్లాలకు పంపిణీ చేసిశామని పేర్కొంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఈ నెల 4, 5 తేదీల్లో , పట్టణ ప్రాంతాల్లో 4,5,6 తేదీల్లో మొబైల్ బృందాలు ఇంటింటి సర్వే చేపట్టి వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులు ఎవరైనా ఉంటే వారికి అక్కడే చుక్కలు వేస్తారని వైద్యారోగ్యశాఖ తెలిపింది.

ఈతకెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి- కౌతాళం (కర్నూలు జిల్లా)

విద్యార్థుల సరదా ప్రాణాలు తీసింది. రోజూ కలిసిమెలసి పాఠశాలకు వెళ్లే స్నేహితులు ఆదివారం కూడా ఆటలాడుతూ గ్రామ సమీపంలోని చెరువులో సరదాగా ఈత కోసం వెళ్లి మృతి చెందారు. ఆదివారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కర్నూలు జిల్లా కౌతాళం మండలం చిరుతపల్లి గ్రామంలోని పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న అమీర్ (11), దేవేంద్ర (11), యువరాజు కలిసి గ్రామ సమీపంలోని మామిడి చెట్ల వద్ద ఆడుకున్నారు. మిట్ట మధ్యాహ్నం సమీపంలోని చెరువు దగ్గరకు ఈత కోసమని వెళ్లారు. చెరువులో ఈతకు వెళ్లిన అమీర్, దేవేంద్ర నీటిలో మునిగిపోయారు. ఈ సంఘటనను చూసి యువరాజు గ్రామం వైపు పరుగులు తీసి విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి రక్షించేలోపు చిన్నారులు ఇద్దరూ మృతి చెందారు. దీంతో, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెగ్యులర్ చేయాల్సిందే..

- సమాన పనికి సమాన వేతనమివ్వాలి
- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల మహా గర్జన సభలో ఎవి.నాగేశ్వరరావు



మహాగర్జన సభలో మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్, తదితర క్యాడర్ల ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని, ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాల్సిందేనని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) చైర్మన్ ఎవి.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యాన ఆదివారం జరిగిన మహా గర్జన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం 10,177 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. అయితే అందరినీ రెగ్యులరైజ్ చేస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. రెగ్యులరైజ్ చేస్తామన్న వారికి కూడా నేటికీ నియామక పత్రాలివ్వలేదని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంటిఎస్‌ను, గ్రాస్ శాలరీని కొంత మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు మాత్రమే పరిమితం చేశారని తెలిపారు. ఆప్కాస్‌తో సహా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు గతం నుంచి అమలవుతున్న వేతనం కంటే తక్కువ వేతనాలతో జిఒ 7 జారీ చేశారన్నారు. ఇది మూడు లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం చేయడమేనని తెలిపారు. ఎన్‌హెచ్ఎం, సమగ్ర శిక్షతో సహా అన్ని ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు, ఆప్కాస్ సహా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఎంటిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తోన్న బిజెపితో రాష్ట్రంలోని పాలకపక్షం, ప్రతిపక్షం అనుకూలంగా వ్యవహరిస్తుండటం సరికాదన్నారు. మహాగర్జన సభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు, యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ తోట

ఆయిల్‌పామ్ వైపు మొగ్గు!

- ఏడాదిలో 23 వేల ఎకరాల్లో పెరిగిన సాగు
- ధర నిలకడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అండగా నిలబడాలంటున్న రైతులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

ఆయిల్‌పామ్ సాగు పట్ల ఏలూరు జిల్లా రైతులు మొగ్గుచూపుతున్నారు. మామిడి, జీడిమామిడి తోటలను తొలగించి ఈ మొక్కలు నాటుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 23 వేల ఎకరాల్లో దీని సాగు పెరిగింది. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధర విషయంలో సరైన ప్రోత్సాహం ఇవ్వడం లేదన్న అసంతృప్తి రైతుల్లో ఉంది. ప్రభుత్వాలు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగే అవకాశం ఉందని వారు చెప్తున్నారు. జిల్లాలోని మెట్టప్రాంతం ఆయిల్‌పామ్ సాగుకు పేరెన్నికగన్నది. 27 మండలాలు ఉండగా, 22 మండలాల్లో 1.30 లక్షల ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. మొక్కజొన్న, అరటి, మామిడి వంటి పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఆయిల్‌పామ్ సాగుతో పెద్దగా ఇబ్బందులు లేకపోవడం, ఈ తోటలకు కౌలు ఎక్కువగా వస్తుండడంతో భూ యజమానులు ఇటువైపు మళ్లుతున్నారు. ఆయిల్‌పామ్ తోట వేసిన మూడేళ్లకు దిగుబడి ప్రారంభం అవుతుంది. ఎకరాకు 143 మొక్కల వరకూ నాటుతారు. దిగుబడి వచ్చే వరకూ అంతర పంటలుగా మొక్కజొన్న, కూరగాయలు, కోకో వంటి పంటలను సాగు చేస్తున్నారు. నూనె శాతం ఆధారంగా ఆయిల్‌పామ్ ధర నిర్ణయిస్తారు. జిల్లాలోని పెదవేగిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఉంది. దీన్ని నిర్మించి చాలా ఏళ్లు కావడంతో నూనె శాతం నిర్ధారణలో తేడాలు వస్తున్నాయి. దీంతో, తెలంగాణ జిల్లా అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో నూనె శాతం నిర్ధారణ ఆధారంగా ధర నిర్ణయిస్తున్నారు. కొత్త ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మించాలని పదేళ్లుగా రైతులు కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. పెదవేగి మండలం రామశింగారంలో 50 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థల సేకరణ జరిగినా నిర్మాణం ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే తమకు మేలు కలుగుతుందని రైతులు చెప్తున్నారు. దీని నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిలకడలేని ధరతో తీవ్ర ఇబ్బందులు

ధరలో నిలకడ లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. గడిచిన ఏడాదిలో టన్ను ఆయిల్‌పామ్ ధర రూ.23 వేల వరకూ పలికింది. ఈ ఏడాది టన్ను రూ.12,410కు పడిపోయింది. కొన్నిసార్లు అంతకన్నా తక్కువ పలికిన సందర్భాలూ ఉన్నాయి. ఎకరాకు ఎనిమిది టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. దీంతో, ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకూ ఆదాయం సమకూరుతుంది. ఎకరాకు రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకూ పెట్టుబడి అవుతుంది. భూ యజమాని సాగు చేస్తే నష్టాలు లేకుండా బయటపడుతున్నాడు. కౌలురైతులు కౌలు కింద ఎకరాకు రూ.70 వేలు వరకూ చెల్లించాల్సి రావడంతో నష్టపోతున్నారు. ధర పెరుగుతుందన్న ఆశతో రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు మక్కువ చూపుతున్నారు. ధర విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఏమాత్రమూ అండగా నిలవడం లేదు. మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తే పామాయిల్ సాగు ఇంకా వృద్ధి చెందే అవకాశం ఉంది.

కొత్తగా తోటలు వేసే రైతులకు సబ్సిడీ

ఒక్క ఏడాదిలో 23 వేల ఎకరాల్లో కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టడంతో జిల్లా మొదటి స్థానంలో ఉంది. కొత్తగా తోటలు వేసే రైతులకు మొక్కకు రూ.193 సబ్సిడీని ప్రభుత్వం ఇస్తోంది. నాలుగేళ్ల వరకూ ఎరువులు ఇతర ఖర్చుల కింద హెక్టారుకు రూ.5,250, అంతర పంటలకు అదే స్థాయిలో సబ్సిడీ అందిస్తోంది. దేశంలో ఆయిల్‌పామ్ పంటకు భవిష్యత్తులోనూ మంచి ఆదరణ ఉండనుండడం, మార్కెట్ గ్యారెంటీ, నిత్య ఆదాయం, కౌలు బాగా వస్తుండడంతో రైతులు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. పెదవేగి మండలం రామశింగవరంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి స్థల సేకరణ జరిగింది. నిర్మాణం చేయాల్సి ఉంది.

-ఎస్.రామ్మోహన్,
ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్, ఏలూరు జిల్లా

వృత్తిదారులను మోసం చేసిన మోడీ సర్కార్

- బిజెపిని, దానితో అంటకాగుతున్న పార్టీలను ఓడించాలి
- ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పదేళ్ల కాలంలో బిసిల జీవనాధార వృత్తులకు మేలు చేయకపోగా, కార్పొరేట్ల కోసం వృత్తులన్నింటినీ ధ్వంసం చేశారని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, రాష్ట్రంలోని మోడీ మిత్రులైన టిడిపి, జనసేన పార్టీలను, వైసిపిని ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనరు మన్నూరు భాస్కరయ్య కోరారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ పదేళ్లలో వృత్తిదారులకు జరిగిన ద్రోహంపై చర్చించారు. ఈ సందర్భంగా మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ.. నరేంద్ర మోడీ తాను బిసినని చెప్పుకుంటూ కులగణన ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. కులగణన చేస్తే తమ ఆధిపత్యానికి గండిపడుతుందనే మోడీ ప్రభుత్వం చేయడం లేదని విమర్శించారు. 18 రకాల వృత్తుల వారికి రూ.రెండు లక్షల చొప్పున రుణసాయం అందిస్తామని ఆర్భాటంగా చెప్పిన మోడీ ఎంత మందికి రుణసాయం అందించారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా బిసిల పేరుతో నిలువునా ముంచుతుందని విమర్శించారు. 56 కుల కార్పొరేషన్‌లు పెట్టి నిధులివ్వకుండా తమ కార్యకర్తలకు పదవులను కట్టబెట్టారని అన్నారు. రాష్ట్రంలో బిసి కార్పొరేషన్‌ల నిధులన్నింటినీ పక్కదారి పట్టించారని విమర్శించారు. సేవ వృత్తిలో వున్న వారికి అట్రాసిటీ చట్టం వర్తించేలా చట్టం చేయాల్సిన అవసరం వుందన్నారు. రద్దయిన వృత్తిదారుల పథకాలను తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సదస్సులో ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కోలాట శ్రీనివాస్, జుత్తిగ నరసింహమూర్తి, గుంజి దయాకర్ (కల్లుగీత కార్మిక సంఘం), గంటా శ్రీరామ్ (గొర్రెలు మేకల పెంపకందారుల సంఘం), వృత్తిదారుల సంఘం నాయకులు లింగాల నిర్మలమ్మ, సిహెచ్ రమణ, వి వెంకటేశ్వరరావు, వాకా రామచంద్రరావు, కిలారి పెద్దబ్బయ్య, చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు.

యువ ఫొటోగ్రాఫర్ దారుణ హత్య

- కోనసీమ జిల్లాలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి- మధురవాడ (విశాఖపట్నం)



జివిఎంసి ఆరో వార్డు పరిధి బక్కన్నపాలేనికి చెందిన యువ ఫొటోగ్రాఫర్ పోతిన సాయి (23) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సమీపంలో దారుణ హత్యకు గురయ్యారు. ఫొటో షూట్ ఉందని చెప్పి పిలిచి కిడ్నాప్ చేసి దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. పిఎం.పాలెం పోలీసుల కథనం ప్రకారం... సాయి వృత్తి రీత్యా ఫొటోగ్రాఫర్. గత నెల 26న షణ్ముఖ్ అనే వ్యక్తి వెడ్డింగ్ షూట్ కోసం తనను పిలిచాడని ఇంట్లో వాళ్లకు చెప్పి రాజమండ్రి బయలుదేరారు. అక్కడ నుంచి సదరు వ్యక్తితో కలిసి రావులపాలెం వైపు కారులో బయలుదేరారు. అంతకు ముందే కారులో కొందరు వ్యక్తులు ఉన్నారు. వారి కదలికలపై అనుమానం వచ్చి తాను ప్రయాణిస్తున్న కారు ఫొటోను తీసి తన తల్లి రమణమ్మకు పంపించారు. ఓ ఫోన్ నెంబర్ కూడా పంపి తన నెంబర్ అవ్వకపోతే ఆ వ్యక్తి నెంబర్‌కు ఫోన్ చేయాలని సమాచారం పంపారు. రోజులు గడుస్తున్నా కొడుకు తిరిగి ఇంటికి రాకపోవడంతో రమణమ్మ ఆందోళనకు గురయ్యారు. నెంబర్ స్విచ్ ఆఫ్ రావడంతో గత నెల 29న పిఎం.పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఆమె ఫిర్యాదు చేశారు. రావులపాలెం ప్రాంతంలోని ఆలమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో సాయి హత్యకు గురైనట్లు పోలీసుల దర్యాప్తులో శనివారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో షణ్ముఖ్‌తోపాటు మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సాయి వద్ద ఉన్న విలువైన కెమెరా, వస్తువుల కోసమే హత్య చేశారా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అన్న విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర భాషను సమాజం తిరస్కరించాలి : జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల కాలంలో కొందరు రాజకీయ నాయకులు తమ రాజకీయ ప్రత్యర్థులపై మాటలు, వాడుతున్న భాష అసభ్యకరంగా వుంటోందని, దానిని మార్చుకునేలా పౌరసమాజం వారిపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం వుందని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో నూతన సెమినార్ హాల్‌ను మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు వాడుతున్న భాషపై నగరంలోని ప్రముఖులు, మేధావులతో చర్చావేదిక జరిగింది. ఎమెస్కో విజయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ నాయకుల భాషపై వ్యతిరేకత, నిరసన తెలపాల్సిన అవసరం ఉందని అన్నారు. తద్వారా రాజకీయ నాయకుల ఆలోచన మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. మీడియా రంగం కూడా ఇటువంటి అసభ్య పదజాలాన్ని వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పత్రికలు, టివి చానెల్స్, ఇతర సోషల్ మీడియా వేదికలు రాజకీయ నాయకులు వాడే భాషను నియంత్రించాలన్నారు. సీనియర్ జర్నలిస్టు, పూర్వ సంపాదకులు రామచంద్రమూర్తి తీర్మానాన్ని ప్రవేశపెడుతూ.. రాజకీయ నాయకులు వాడుతున్న భాషను ప్రజల్లో చర్చకు పెట్టాలని, తద్వారా వారిపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ఇలాంటి సదస్సులను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కొందరు నేతలు సెన్సేషన్ కోసం వాడకూడని పదాలను వాడటం, హావభావాలను ప్రదర్శించడం జరుగుతోందన్నారు. అటువంటి ధోరణులను ప్రజలు తిరస్కరించాలన్నారు. ప్రజాశక్తి సంపాదకులు బి తులసీదాస్ మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే మీడియా సంస్థలు అసభ్య పదజాలాన్ని ప్రోత్సహించవని అన్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక హోదా సాధన కమిటీ కన్వీనరు చలసాని శ్రీనివాస్, ప్రజావైద్యులు సుధాకర్, ప్రోగ్రెసివ్ ఫోరం కన్వీనరు బుడ్డిగ జమీందార్, ప్రొఫెసర్ అంజిరెడ్డి, అంజయ్య, అక్కినేని వనజ, ఉషారాణి, విజయవాడ బుక్ ఫెస్టివల్ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌నాయుడు, కె లక్ష్మయ్య, రచయిత ఖాదర్ మొయిద్దీన్, జి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగన్ ఓటమి ఖాయం

- రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఎన్నికల్లో ఎపిలో జగన్ ఓటమి ఖాయమని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ పత్రికా కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్యాలెస్‌లో కూర్చొని పథకాల పేరుతో డబ్బులిస్తామంటే ఓట్లు రాలవన్నారు. తెలంగాణాలో కెసిఆర్ ఓటమికి కూడా ఇదే కారణమని విశ్లేశించారు. సంక్షేమ పథకాలే కాదు.. అభివృద్ధి కూడా ముఖ్యమని చెప్పారు. ఎపిలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, జగన్ ఏమి చేసినా గెలవడం కష్టమని తెలిపారు. గత ఎన్నికల్లో వైసిపికి ప్రశాంత్ కిశోర్ పని చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్లుగా రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో





ఆంధ్రప్రదేశ్ ఎన్నికల కు కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కర్ణాటక సిఎం సిద్ధరామయ్యను నియమించాలని ఎఐసిసి భావిస్తోంది. వీరితో పాటు పలువురు అగ్రనేతలు కూడా స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉండనున్నారు. ఈ మేరకు ఢిల్లీ పెద్దలు..పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డికి సమాచారం పంపినట్టు తెలిసింది. ఇప్పటికే ఆమె పలు దఫాలుగా రేవంత్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. స్టార్ క్యాంపెయినర్లుగా ఇప్పటి వరకు ఎఐసిసి నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోయినా, త్వరలోనే ఆయన పేరును ప్రకటించనున్నట్టు ప్రచారం జరుగుతోంది.

జిందాల్‌తో బతుకులు బుగ్గి

- నిర్వాసితుల గోడు
- 18 ఏళ్లు గడిచినా ఏర్పాటు కాని కంపెనీ
- భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తామని, అందుకోసం భూములు ఇచ్చిన వారందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని 2006లో అప్పటి ప్రభుత్వం ఆశ చూపింది. ఇందుకు నిరాకరించిన రైతులను, వారికి అండగా నిలిచిన సిపిఎం నాయకులను అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేసింది. కోట్ల రూపాయల విలువైన భూములను కారు చౌకగా లాగేసుకుని జిందాల్ కంపెనీకి కట్టబెట్టింది. నేటికి 18 ఏళ్లు కావచ్చినా కంపెనీ ఏర్పాటు కాలేదు. ఉద్యోగ, ఉపాధి కల్పన ఎండమావిగా మారింది. నిర్వాసితులు, వృత్తిదారులు, కూలీలు ఉపాధి కోసం రోజూ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

ఉమ్మడి విశాఖ జిల్లా అరకు, అనంతగిరి కొండల్లో నిక్షిప్తమై ఉన్న బాక్సైట్ గనులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించింది. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు బొడ్డవర, లక్ష్మీపురం, అమ్మవలస, మొట్టవలస, చినఖండేపల్లి, ముషిడిపల్లి, కొత్త అడ్డతీగల తదితర గ్రామాలకు చెందిన 1,127 ఎకరాలను రైతులను నుంచి బలవంతంగా లాక్కొని జిందాల్‌కు అప్పగించింది. అప్పట్లో ఎకరాకు రూ.2.5 లక్షల చొప్పున మాత్రమే పరిహారం ఇచ్చారు. నేడు ఈ ప్రాంతంలో ఎకరా రూ.80 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతోంది. కారు చౌకగా భూములు లాక్కోవడాన్ని నిర్వాసిత రైతులు సిపిఎం ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ప్రతిఘటించారు. దీన్ని జీర్ణించుకోలేని అప్పటి ప్రభుత్వం సిపిఎం నాయకులు తమ్మినేని సూర్యనారాయణ సహా ఇతర పార్టీల నాయకులను, నిర్వాసితులను అరెస్టు చేసి తప్పుడు కేసులు పెట్టి జైలు పాలు చేసింది. మరోవైపు బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ అరకు, అనంతగిరి ప్రాంతంలో సిపిఎం, ఎపి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. ఆ ప్రాంతంలో సర్వే చేపట్టేందుకు వచ్చిన అన్‌రాక్ కంపెనీ ప్రతినిధులను విల్లంబులతో తరిమారు. నిర్వాసితుల, గిరిజనుల రెండేళ్ల నిర్విరామ పోరాటంతో అప్పటి ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలను విరమిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ భూములను తిరిగి రైతులకు అప్పగించాల్సిన ప్రభుత్వం ఆ పని చేయలేదు. జిందాల్ కంపెనీ ఆ భూములను రూ.112.77 కోట్లకు బ్యాంకులో తనఖా పెట్టినట్టు సమాచారం. ఆ భూముల కోసం రైతులు పోరాడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ భూముల్లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఏడాది క్రితం ఇచ్చిన హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు.



జిందాల్ కోసం తీసుకున్న భూములను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్ ఫొటో)

నిర్వాసితులకు అందని పరిహారం

నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం అందలేదు. అప్పట్లో ఇచ్చిన పరిహారమే తక్కువ. అందులోనూ కొంతమంది నిర్వాసితులకు ఇచ్చిన చెక్కులను కూడా అధికారులు వెనక్కి తీసుకున్నారు. ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న వారికి, అసైన్డ్ భూముల నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేదు. కళ్లెదుటే భూములున్నా వాటిని సాగు చేసుకునేందుకు వీలులేని పరిస్థితి ఉంది.

ఈ నేపథ్యంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, రైతు సంఘం, గిరిజన సంఘాల నాయకులు లక్ష్మీపురం, బొడ్డవర తదితర గ్రామాల్లో ఇటీవల పర్యటించారు. నిర్వాసితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. 'కంపెనీ లేదు. ఉద్యోగాలూ లేవు. భూములు లాగేసుకుని మా పొట్టకొట్టారు. ఇప్పటికైనా తిరిగి మా భూములు మాకు అప్పగించకపోతే బతికేందుకు ఆస్కారం లేదు' అంటూ ఈ సందర్భంగా నిర్వాసితులు సిపిఎం నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు.

ఇచ్చిన చెక్కును తిరిగి తీసేసుకున్నారు



మా వద్ద భూములు లాక్కున్నప్పుడు జిందాల్ నుంచి నాకు రూ.లక్ష చెక్కు ఇచ్చారు. ఆ తరువాత కొద్ది రోజులకే విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయానికి పిలిపించి ఆ చెక్కును వెనక్కి తీసుకున్నారు. మాకు సదువు రాదు. ఎందుకు ఇచ్చారో... ఎందుకు లాగేసుకున్నారో ఇప్పటికీ అర్థం కావడం లేదు. భూములు కోల్పోయాక కూలీలుగా మారాం. రెండేళ్ల నుంచి కూలి పనులు స్థానికంగా దొరక్క ఇబ్బంది పడుతున్నాం.

-కొత్తపల్లి సింహాచలం, కొత్త అడ్డతీగల

భూములు తిరిగి ఇచ్చేవరకు పోరాటం




బాక్సైట్ శుద్ధి కర్మాగారం పేరిట అప్పట్లో కారుచౌకగా జిందాల్ సంస్థకు అప్పగించిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలి. పరిశ్రమ ఏర్పాటు కాకపోతే చట్టప్రకారం ఆ భూములను తిరిగి రైతులకు ఇవ్వాలి. పశ్చిమ బెంగాల్ సహా అనేక చోట్ల ఈ విధంగానే చేశారు. నిర్వాసితులకు న్యాయం చేయకపోతే వారిని సంఘటితపర్చి పోరాడుతాం.

-తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం విజయనగరం జిల్లా కార్యదర్శి

తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన జగన్

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాకట్టు పెట్టింది కేవలం భవనాలను కాదని, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని అని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. సచివాలయం తాకట్టు అనే వార్తపై ఆదివారం సోషల్ మీడియా ఎక్స్ (ట్విట్టర్)లో స్పందించారు. ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు గుండెకాయలాంటి రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవడమా? అని జగన్‌ను ప్రశ్నించారు. రాష్ట్రానికి ఎంత అవమానకరం, ఎంత బాధాకరం, ఎంత సిగ్గుచేటు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.370 కోట్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి కూర్చునే భవనాన్ని, రాష్ట్ర పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టడం అంటే ఏమిటో ముఖ్యమంత్రికి తెలుసా? అని ప్రశ్నించారు. అసమర్ధ, అహంకార, విధ్వంస పాలనలో ఏం కోల్పోతున్నామో ఆలోచించాలని ప్రజలను కోరారు.

ఐదేళ్ల నుంచి జగన్ తెస్తున్న అప్పులను చూసి తలపండిన ఆర్థిక వేత్తలకు సైతం మైండ్ బ్లాంక్ అవుతోందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రాన్ని రూ.12.5 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన జగన్.. ఇప్పుడు ఏకంగా సచివాలయాన్ని తాకట్టు పెట్టారని అన్నారు. వైసిపి నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.



అరుణోదయ నగర్ రిజిస్ట్రేషన్ చేయాలి

- న్యూ రాజరాజేశ్వరి పేటలో నిరసన దీక్ష కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ రాజరాజేశ్వరి పేట అరుణోదయ నగర్‌లో ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయాలని బుడమేరు రైలు బ్రిడ్జి కింద రోడ్లు నిర్మించి లైట్లు వేయించాలని స్థానికులు ఆదివారం నిరసన దీక్షకు దిగారు. రాజరాజేశ్వరి పేటలో చేపట్టిన ఈ దీక్షకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు మద్దతు తెలిపి మాట్లాడారు. డిస్నీలాండ్ స్థలంలోని ఇల్లు లేని పేదలకు వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రకారం ఎన్నికల ముందే ఇళ్ల స్థలాల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. డిస్నీలాండ్ స్థలంలో కబేళా ఏర్పాటు నిలిపివేయలని, న్యూ రాజరాజేశ్వరి పేటలో ఇళ్లపై నుండి వెళ్తున్న కరెంటు తీగలను ప్రజలకు ఇబ్బంది లేకుండా మార్చాలని డిమాండ్ చేశారు. అయోధ్యనగర్ వైపు రైల్వేలైన్ కింద నుండి వెళ్లే రోడ్ల ఇరువైపుల లైట్లు వేయాలని, అపార్ట్‌మెంట్ వాసులకు బ్యాంక్ అప్పులు ఇచ్చేలా పక్కా రిజిస్ట్రేషన్ పత్రాలివ్వాల కోరారు. 23 ఏళ్ల గడిచిన ఇళ్లకు మాత్రం రిజిస్ట్రేషన్ కాలేదని, తాము గెలిస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని గత ఎన్నికల ముందు వైసిపి హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కార్పొరేషన్లో కమ్యూనిస్టుల హయాంలో తాను కార్పొరేటర్‌గా ఉన్న కాలంలో ఒక్క రూపాయి నుంచి రూ.15ల లోపు నామమాత్రం ధరలకే సింగ్‌నగర్, పాయకాపురం, రాజీవ్ నగర్, కండ్రిగ ప్రాంతాల్లో 40 వేల మందికి పట్టాలు రిజిస్ట్రేషన్ చేయించామని తెలిపారు. అరుణోదయ నగర్ వాసులను వైసిపి, టిడిపిలకు చెందిన ప్రజాప్రతినిధులు మోసం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి రమణరావు, సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె దుర్గారావు, టి శ్రీనివాస్ సాయి, సిఐటియు నాయకులు రాము, కె దుర్గారావు పాల్గొన్నారు.

బెంగళూరు పేలుళ్ల సూత్రధారి అరెస్ట్

ప్రజాశక్తి - మైదుకూరు



బెంగళూరు వైట్‌ఫీల్డ్ రామేశ్వరం హోటల్‌లో పేలుళ్ల ఘటన సూత్రధారి సలీంను ఎన్ఐఎ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. రెండ్రోజులుగా సాగించిన అన్వేషణలో భాగంగా శనివారం ఎన్ఐఎ అధికారులు కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట దగ్గర మారుమూల గ్రామం చెర్లోపల్లెలో ఒక ప్రార్థన మందిరంలో ఉండగా..సలీంను అదుపులోకి తీసుకున్నారు. మైదుకూరు నుండి పది కిలోమీటర్ల పరిధిలోని తెలుగు గంగ కాలువకు సమీపంలోని పప్పనపల్లె పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన సదరు ప్రార్థన మందిరంలో కొన్ని బాధ్యతల నిర్వహణ కోసం ఆయన ఇటీవల నియమితులైనట్లుగా చెబుతున్నారు.


జనసేన అధినేతను కలిసిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

జనసేనలోకి చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు

- సస్పెండ్ చేసిన వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికార వైసిపికి చెందిన చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదివారం పవన్‌కల్యాణ్‌ను కలిసి జనసేనలో చేరారు. శ్రీనివాసులును రాజ్యసభకు పంపుతారని వార్తలు వచ్చినా.. చివరి క్షణంలో ఆ పార్టీ మేడా రఘునాథ్‌రెడ్డిని పంపింది. చిత్తూరు వైసిపి టికెట్‌ను విజయానందరెడ్డికి ప్రకటించడంతో ఆయన జనసేన వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. పవన్‌కల్యాణ్‌ను శ్రీనివాసులు ఆదివారం హైదరాబాద్‌లో కలవగానే వైసిపి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది.

ఎంఎస్ఎంఇల అభివృద్ధి కోసమే సర్వే

- 'ప్రజాశక్తి' కథనంపై స్పందించిన జిల్లా పరిశ్రమల అధికారి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) పనితీరు మెరుగు, వాటి అభివృద్ధి కోసం రైజింగ్, యాక్సలరేషన్‌టింగ్ ఫెర్ఫార్మేన్స్ (ర్యాంప్) సర్వే దోహదపడుతుందని శ్రీకాకుళం జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎ.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. 'వణికిస్తున్న జిఎస్‌టి సర్వే' శీర్షికన ప్రజాశక్తిలో ఆదివారం ప్రచురించిన కథనానికి ఆయన స్పందించి వివరణ ఇచ్చారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లో వివిధ వ్యాపార సంస్థలను డిజిటల్ ప్లాట్‌ఫాంలోకి తీసుకొచ్చి ఎపిఎంఎస్ఎంఇ వన్ పోర్టల్‌లో అనుసంధానం చేయనున్నామని చెప్పారు. సర్వే మార్చి 1 నుంచి ప్రారంభమైందని చెప్పారు.

అధిష్టానం నిర్ణయం బట్టే అడుగులు : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పొత్తులపై జాతీయ నాయకత్వం తీసుకునే నిర్ణయాన్ని బట్టి తమ కార్యాచరణ ఉంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివ ప్రకాష్‌జీ ఆధ్వర్యాన 26 జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నేతల సమావేశం రెండు రోజులపాటు జరిగింది. సమావేశం వివరాలను ఆదివారం పురందేశ్వరి మీడియాకు వెల్లడించారు. 175 అసెంబ్లీ, 25 ఎంపి సీట్లలో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు సంబంధించిన ఫీడ్ బ్యాక్‌ను నేతల నుంచి తీసుకున్నామన్నారు. బిజెపి నుంచి పోటీ చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. పార్లమెంటరీ కమిటీ సమీక్ష చేసి అభ్యర్థులను ఖరారు చేస్తుందని తెలిపారు. తాము సేకరించిన అభిప్రాయాల జాబితాను రెండు రోజుల్లో కేంద్రానికి పంపుతామన్నారు.

14న చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

- రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని, రైతు, కౌలురైతుల పంట రుణాలను రద్దు చేయాలని కోరుతూ.. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఈ నెల 14న చేపట్టనున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యాన ప్రతి గ్రామంలో, మండల కేంద్రాల్లో రైతులు పెద్దయెత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన రైతు సంఘం నాయకులు చుండూరు రంగారావు అధ్యక్షతన రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో వై కేశవరావుతోపాటు సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకులు రావుల వెంకయ్య మాట్లాడారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర ప్రకటించి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా రైతులను రుణవిముక్తి చేసి, ఆత్మహత్యల నుంచి కాపాడేందుకు ఒకసారి రైతు, కౌలురైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలన్నారు. అలాగే కేరళ తరహాలో రుణ ఉపశమన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. గత రైతాంగ ఉద్యమం సందర్భంగా రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈ నెల 14న ఢిల్లీలో మహా పంచాయత్ (బహిరంగ సభ)ను నిర్వహించనున్నామని, ఈ సభలో పెద్దయెత్తున రైతాంగం పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోడీని గద్దె దించి, బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కోరారు. రైతు ఉద్యమంలో పంజాబ్ యువ రైతు శుభ్ కరణ్ సింగ్‌ను హర్యానా రాష్ట్ర ప్రభుత్వం బలి తీసుకుందని విమర్శించారు. ఈ హత్యపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగంతో సంప్రదించకుండానే పెట్టిన విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందకుండానే రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. 14న జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె సుబ్బరావమ్మ, ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ కార్యదర్శి ఎం వెంకటసుబ్బయ్య, ఇఫ్టూ కార్యదర్శి పోలారి తదితరులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తక్షణమే కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీ కరణ నిలుపుదలను చేయాలని, కడప ఉక్కును వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతాంగం చేపట్టిన ఉద్యమంలో కార్మిక రంగం భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, కార్యదర్శి పి జమలయ్య, రైతు సంఘాల నాయకులు యల్లమందారావు, డి హరినాథ్, మరీది ప్రసాద్, యు వీరబాబు, గొల్లపూడి ప్రసాద్, వి నరసింహారావు, కొలనకొండ శివాజీ, జి రంగారెడ్డి, పంచుమాటి అజయ్, కార్మిక సంఘాల నాయకులు ఆర్‌వి నరసింహారావు, కాసాని గణేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ టీచర్లకు ఎంటిఎస్ అమలు చేయాలి

- బొప్పరాజు, శివకుమారి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి సమగ్రశిక్షా పరిధిలో క్రాఫ్ట్, ఆర్ట్, వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు తక్షణమే మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటిఎస్) అమలు చేయాలని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఎపి వర్క్ ఆర్ట్ వ్యాయామ ఉపాధ్యాయుల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సైకం శివకుమారి, శంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘ భవనంలో ఆదివారం రాష్ట్ర స్థాయి సమగ్రశిక్షా ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో బొప్పరాజు మాట్లాడుతూ.. గత పదేళ్లుగా రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పాఠశాల విద్యలో విధులు నిర్వహిస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్, వ్యాయామ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. లక్షలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించిన ఇఎస్ఐ, ఇపిఎఫ్ ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. వెంటనే అమలు చేయాలన్నారు. శివకుమారి మాట్లాడుతూ.. వృత్తి విద్య ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారికి ఒకేషనల్ ఉపాధ్యాయులుగా హోదా మార్పు చేయడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో ఎపి జెఎసి అమరావతి మహిళా విభాగం ఛైర్మన్ పారె లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పి శ్రీదేవి, గ్రామ, వార్డు సచివాలయం సంక్షేమ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు వి ఆర్లయ్య పాల్గొన్నారు.

లౌకికతత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు ఐక్యమవ్వాలి

- సెక్యులర్ ఫోరం సదస్సులో వక్తల పిలుపు

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్




సదస్సులో మాట్లాడుతున్న విజయశంకర్ స్వామీజీ

దేశంలో మతోన్మాదులను ఓడించడానికి, లౌకిక తత్వాన్ని కాపాడుకోవడానికి ప్రజలు కులమతాలకతీతంగా ఐక్యమై ముందుకు రావాలని సెక్యులర్ ఫోరం సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. 'లౌకిక తత్వాన్ని కాపాడుకుందాం – మతోన్మాదులను ఓడిద్దాం' అనే అంశంపై కర్నూలు సెక్యులర్ ఫోరం ఆధ్వర్యాన ఈడెన్ గార్డెన్‌లో ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా శ్రీ అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి, జయహో జాతీయ అధ్యక్షులు విజయశంకర్ స్వామీజీ మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర పోరాటంలోనే బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు కలిసి ఐక్యంగా పోరాడారని, దానికి ప్రత్యక్ష ఉదాహరణ ఆర్య సమాజ్ సభ్యుడైన రాంప్రసాద్ బిస్మిల్, సంప్రదాయ ముస్లిం మతస్తుడైన అష్ఫాకుల్లా ఖాన్ అని గుర్తు చేశారు. వారిద్దరూ స్వతంత్ర పోరాటం కోసం ఉరికంబాన్ని ఎక్కిన మహనీయులని కొనియాడారు.

అలాంటి మహవీరులు తెచ్చిపెట్టిన స్వాతంత్ర దేశంలో నేడు పాలిస్తున్న పాలకులకు స్వాతంత్ర పోరాటంలో ఎలాంటి పాత్ర లేదని తెలిపారు. రాజ్యాంగం భారతదేశాన్ని లౌకిక దేశంగా పేర్కొన్నప్పటికీ ప్రస్తుతం ఉన్న పాలకులు వాటికి తిలోధకాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అలాంటి వారిని నిలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ మన్సూర్ రహ్మాన్ మాట్లాడుతూ.. నేటి పాలకులు భారతదేశ చరిత్రను వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, వాస్తవ చరిత్రను ప్రజలకు తెలియకుండా చేస్తున్నారన్నారు. స్వాతంత్ర పోరాటంలో ముస్లిముల పాత్ర చాలా కీలకమైందని తెలిపారు. బిజెపి పాలనలో ముస్లిం చక్రవర్తులను విలన్లుగా చూపించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ పదేళ్ల దేశాన్ని పాలించిన బిజెపి వల్ల భారత రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. 2024 పార్లమెంటు ఎన్నికల్లోనూ 370 సీట్లు సాధించి మనువాద రాజ్యాంగాన్ని ఏర్పాటు చేయడానికి పూనుకుంటుందన్నారు. అదే జరిగితే భారతదేశంలో మైనార్టీ ప్రజలందరూ రెండవ తరగతి పౌరులుగా జీవించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం రాష్ట్రాల హక్కులను హరిస్తున్నా రాష్ట్రంలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు స్పందించకపోవడం దారుణమన్నారు. భారత రాజ్యాంగాన్ని, లౌకిక వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కుల, మతాలకతీతంగా ప్రజలు ఐక్యమై పోరాటంలోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ జబ్బర్ మౌలానా, మునీర్ అహమ్మద్, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఎ.సుభాన్, నగర అధ్యక్షులు ఎగ్బాల్ హుస్సేన్, సెక్యులర్ ఫోరం నగర నాయకులు నాసిర్, సివిల్ ఫోరం కన్వీనర్ ప్రసాద్ శర్మ, గౌస్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వారాల్లోనే ఎస్‌పి మల్లిక గార్గ్ బదిలీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:



తిరుపతి జిల్లా ఎస్‌పి మల్లిక గార్గ్‌ని మూడు వారాల్లోనే ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమె స్థానంలో జిల్లా నూతన ఎస్‌పిగా కృష్ణకాంత్ పటేల్ నియమించింది. తిరుపతి ఎస్‌పిగా పనిచేస్తున్న మల్లిక గార్గ్‌ను సిఐడి ఎస్‌పిగా, విజయవాడ డిసిపిగా పనిచేస్తున్న కృష్ణకాంత్ పటేల్‌ను తిరుపతి ఎస్‌పిగా బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో వారు బదిలీ అయిన ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. దొంగ ఓట్ల విషయంలో అధికార పార్టీకి అనుకూలంగా ఉండకపోవడమే మల్లిక గార్గ్ బదిలకి కారణమని ప్రచారం జరుగుతోంది. ఇటీవల తిరుపతి జిల్లా నూతన ఎస్‌పిగా బాధ్యతలు తీసుకున్న ఆమె బదిలీ కావడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణకు మారుపేరు, వివాదరహితంగా ఉంటారని గతంలో మల్లిక గార్గ్ పని చేసిన చోట పేరు తెచ్చుకున్నారు. బాధ్యతలు తీసుకున్న పాతిక రోజుల్లోనే ఏకై వచ్చి మేకులా మారారని అధికార పార్టీ పెద్దలు భావించి ఉంటారని, అందుకే హుటాహుటిన ఆమెపై బదిలీ ఆదేశాలు సిద్ధం చేశారని విశ్వసనీయ సమాచారం.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురు కాల్పులు

- జవాన్, మావోయిస్టు మృతి

ప్రజాశక్తి - చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)


లభ్యమైన తుపాకీ, ఇతర వస్తువులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం లోని కాంకేర్ జిల్లాలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక జవాన్, మావోయిస్టు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. కాంకేర్ జిల్లా చోటే పోలీస్ స్టేషన్ పరిధిలోని హిందూ అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లిన జవాన్లకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో వారి మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో జవాన్ కోరేటి రమేష్‌తోపాటు ఓ మావోయిస్టు మృతి చెందినట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. ఘటనా స్థలంలో మావోయిస్టుకు చెందిన ఎకె 47 తుపాకీ, కొన్ని వస్తువులు లభ్యమయ్యాయి. చనిపోయిన మావోయిస్టు ఎవరన్నదీ తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు.

రాయలసీమ నీటి సమస్య సాహిత్యంలో ప్రతిబింబించాలి

- జలకవనంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి -పెనుకొండ




సమావేశంలో మాట్లాడుతున్న సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్

రాయలసీమ జిల్లాల్లో నెలకొన్న నీటి సమస్య సాహిత్యంలో ప్రతిబింబించాలని జలకవనంలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణం లోని గగన్ మహల్ ఆవరణంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన రాయలసీమ జిల్లాల జలకవనం ఆదివారం నిర్వహించారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ఎ.హరి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, రాయలసీమ జలసాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి, కవులు ఏలూరి యంగన్న, సడ్లపల్లి చిదంబర రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షపాతం తక్కువగా ఉన్న రాయలసీమ జిల్లాల్లో నీటి సమస్య పరిష్కారంలో పాలకులకు చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, వర్షపు నీటిని నిల్వ చేసుకొనే సామర్థ్యం లేకపోవడంతో నీటి ఎద్దడి రోజు రోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జలకవనంలో జరిగే సాహిత్యం ద్వారా నీటి సమస్యపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రభుత్వాలు కళ్లు తెరిచే విధంగా కవితలు, పద్యాలు, పాటలు ఉండాలన్నారు. రాయలసీమ ఎదుర్కొంటున్న నీటి కరువుకు కారణాలు ఏమిటో కవులు, రచయితల పాటలు, పద్యాలు, కవితల ద్వారా ప్రతిబింబింపజేయాలని సూచించారు. రాయలసీమకు అడుగుతున్న నీటి హక్కులు ప్రాంతీయ తత్వం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన కవులు, గాయకులు తమ కవితలను, పద్యాలను, పాటలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి సభ్యులు రాజశేఖర్, కోగిర జయచంద్ర, రామన్న, యుటిఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణ స్వామి, రమేష్, పలువురు మేధావులు, ప్రముఖులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో మాచర్ల ఎమ్మెల్యే గన్‌మెన్ మృతి

ప్రజాశక్తి-బాపట్ల



రోడ్డుప్రమాదంలో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గన్‌మెన్ మృతి చెందారు. ఈ ఘటన బాపట్ల-పొన్నూరు మార్గమధ్యలో చుండూరుపల్లి వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. బాపట్ల పట్టణం, ఉప్పరపాలెంకు చెందిన గోపిరెడ్డి (30) 2018లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. ప్రస్తుతం మాచర్ల ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం బైక్‌పై బాపట్ల బయలుదేరారు. చుండూరుపల్లి వద్ద లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్‌టిసి బస్సు, వెనుక వస్తున్న లారీ రెండూ బైక్‌ను ఢీకొన్నాయి. దీంతో గోపిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు.


అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 4 మార్చి 2024



"తెలుగు నాట భక్తిరసం
తెప్పలుగా పారుతోంది
డ్రయినేజీ స్కీము లేక
డేంజరుగా మారుతోంది."
– గజ్జెల మల్లారెడ్డి



ఆమెని...

చేతుల్నిండా అమరన్నేను
ఉసూరుమనే నిట్టూర్పుల్లో
పుట్టిన్నాడే నేనెక్కడో తప్పిపోయాను
ఇల్లెంత విశాలమైనా
ఆ.. లోపలనే.. పట్టలేనంత ఇరుకు!
ఇష్టం లేని పెంపకాల్లో అనివార్యమై
వంటగది మూలాల్లో
తలుపెనకాల మొహం దాచి
పలువరసకు మెరుపుందనే సంగతి మరచిపోయాను!

వెనుక పుట్టిన చిన్నోడెందుకు గొప్పోడయ్యాడో
వాడికీ నాకూ తేడా ఎందుకో తెలీదప్పుడు
పదేళ్ల దాటక మునుపే తెలీని అభద్రత
ఎక్కడో ఏదో జరుగుతోంది
పంచుకునే మనిషెవరో అర్థం కాని వయసది!

చీకటి చిట్లిపోకమునుపే
తెల్లారలేదా అంటూ
వీపుపై అయిష్టపు ముద్ర!
నిద్రా పక్షపాతే..!
మగపిల్లలకే ఆ.. వరం.. ట!
వాడికీ..
జోకొట్టాలి ప్రేమగా, జోలా.. పాడాలి.. లాలా పొయ్యాలి
అమ్మతనం పుట్టగానే మొదలవుతుందో..
లోకాన్ని అర్థం చేసుకున్నాక అబ్బుతుందో
అదో సహజాతి సహజ ప్రక్రియ

గర్భంలో తొమ్మిది నెలలు మోసాక్కూడా
ఆమెకూ.. పక్షపాతమే!
అంటరానితనాన్ని అంటుకట్టినట్టు
గుండెల్లో కుంపటని, నెత్తిమీద బరువనీ
తూకమేస్తుంటారు
వెటకారాలూ, ఛీత్కారాలూ
అతి గౌరవంగా పరిచయం చేస్తూ అధికారాన్ని గుప్పిస్తూ..
బతుకు చిత్రాన్నే మార్చేస్తుంటారు!

నేను
ఆమనిలో ఆచూకీ వెదుకుతున్న అవేదనని
అయినా..
నేనంటే నేను మాత్రమే కాదు
అనేకానేక ఆక్రందనల్ని
ఆధిపత్యాల్ని చిరునవ్వుతో నెట్టుకొస్తూ..
నింగిలోనూ నేలలోనూ సగం అని పిలవబడుతున్న
అసంపూర్ణ వాక్యాన్ని..
నేను.. నే.. నూ..
ఆమెని...

– కోడే యామినీ దేవి

ఆమె, నేను, ఓ వెన్నెల రాత్రి

కుదరని వాక్యాలతో కుస్తీ పడుతూ
పెరటి మంచానికి, దిగులు నవారునల్లుతూ నేను..
మోసీ, మోసీ అలసిపోతుందేమో
కాసేపు కలతల్ని దించేసి ఒడిలో వాలుతుందామె!
పూల చెట్లే లేని పెరట్లో
సంపెంగ పరిమళమెక్కడిదని అడిగిన చిలిపి ప్రశ్నకు
సిగ్గును జవాబుగా రాస్తూ కళ్ళు మూసుకుంటుంది...

'గాలి గజ్జెలను' తొడిగిన ఆమె ముంగురులు
నుదుటి వేదికపై నర్తిస్తుండగా,
సున్నితంగా తన చెవిని నిమురుతూనో
మృదువైన కళ్ళను ముద్దాడుతూనో
కవ్వించే ప్రయత్నం నాది...
నాకడ్డు చెప్పని ఇష్టం ఆమెది!

ఒకప్పుడు నక్షత్రాలకు కాపలా కాస్తుండేదేమో...?
ఇప్పుడు వేల వెలుగుల్ని వెంటేసుకుని,
నా ఒడిలో శశి కిరణమై వాలింది...
నింగి ఎదపైనా,
నా ఒడిలోనూ...
సేద దీరుతున్న రెండు 'వెన్నెల పుష్పాలను' చూసి
ముసిముసిగా నవ్వుతూ, కాలం నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది!

– జాబేర్ పాషా
0096878 531638

ట్రోలర్‌తో ముఖాముఖి

ఏం నాయనా ఈ ఫేకుడేంది?
ఫేస్‌బుక్‌లో పని చేస్తున్నా కదా!
ఏం పని చేస్తున్నావు బాబు?
ట్రోలర్‌గా పనిచేస్తున్న.
ఏం పాసయ్యావు తండ్రి?
పాసులు, పట్టాలతో పని లేదండి.
మరి ఎక్కడ చదివావు నాన్న?
వాట్సాప్ యూనివర్సిటీ లోనండి.

జీతభత్యాలు ఏమిస్తారేమిటి?
చేసుకున్నోనికి, చేసుకున్నంత.
మరి మీరు ఏమి చేస్తారేమిటి?
సత్యానికి సర్వమంగళం పాడి
అసత్యాన్ని అందలమెక్కించడం.

ఇంకేమి చేస్తారేమిటి?
మనిషిని ఏకి ఏకి ఏకాకి చేయడం
మా వాడు కాని వాడి గొంతు నొక్కేయడం
పొంతన లేని మాటలతో పొగబెట్టడం
కాకి లాగా పొడిచి పొడిచి పరుగెత్తించడం!

అసలు మీ లక్ష్యం ఏమిటి?
నెటిజనులను నెగలనీయకపోవడం
నెట్టింటిలో నుంచి నెట్టివేయడం

ఇది అన్యాయం కాదా, బాబూ?
ఇది ఆటలో భాగమేనండి.
మీకు మర్యాద, మానవత్వం మనసు లేవా?
అవెందుకండి? మాకు మతం ఉంది కదా!

ఏది మీ ఐడి ఒకసారి చూద్దాం?
మాకన్నీ ఫేక్ ఐడి లేనండి
ఇంతకు మీరు ఎలా ఉంటారు బాబు?
ఓ అదా! మేము ముసుగు వీరులం
కాదు కాదు, ముసుగులో ధూర్తులం!

– డా. ఎడ్ల కల్లేశ్
98667 65126

పద్యక్షేత్రం... వ్యవసాయ కవిత్వం

సందర్భం

అగ్రికల్చర్‌కు సమానార్థకం తెలుగులో వ్యవసాయం కాదు. అగ్రికల్చర్ అన్నదానికి 'భూ సంస్కృతి' అని అర్థం. ఎంత గొప్పదనం ఉందీ ఈ మాటలో! ఆధునిక నీటి నిల్వ, పారుదల నిర్మాణాలు జరగని రోజుల్లో చెరువులే ఆయకట్టు జీవాధారాలు. జమిందారీ యుగంలో (ఆరుద్ర నిర్ణయం) తటాకాలు (చెరువులు), సాగరాలు (భారీ చెరువులు) ఉండేవి. ఈనాటికీ, కొన్ని ఉన్నాయి. వీటి ఆయకట్టుల్లో, బ్రాహ్మణులకు దానంగా వచ్చిన కొన్ని భూములుండేవి. బ్రాహ్మణ కవి, పండితులకు ఇచ్చిన గ్రామాలను 'అగ్రహారాలు' అన్నారు. ఆంధ్రా, ఒరిస్సా కవులకు, నాగలి మేడి పట్టి దుక్కి తెలియదు. కానీ, బమ్మెర పోతన వంటి కవి హాలికులు కొందరు ఉండేవారేమో! పూర్వ సాహిత్యంలో చక్రవర్తుల, రాజుల ప్రశంసలు, కానుకల కోసం కావ్యాలు, ప్రబంధాలు రాసి ఉపాధి పొందిన కవి, పండితులే ఎక్కువ. 'నైలునది నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?' అని ప్రశ్నించిన శ్రీశ్రీ వంటి వారు చాలా తక్కువ. కానీ, కొంతమంది పూర్వకవుల పద్యాల్లో వ్యవసాయ సంబంధ అంశాలు ప్రస్తావితమయ్యాయి.


కర్షక సాహిత్య కవి యుగమనేది మనం నిర్ణయించుకుంటే, అది బమ్మెర పోతన (క్రీ.శ.1450–1510) తోనే ప్రారంభించుకోవాలి. మహా భాగవతానికి తెలుగుదనం అద్దిన పోతన... హాలికుడిగా కూడా ప్రసిద్ధి. ఆ కాలంలో కవి, పండితులు అగ్రహారాలు, భూములు దానంగా పొందినా, మడిలో దిగి మేడి పట్టడం చిన్నతనం. ఆ పని శూద్రులదనే అభిప్రాయం, నిర్ణయం కూడానేమో! కానీ, గంటం పట్టిన చేత్తోనే, పోతన 'హలం' పట్టాడు. ఇప్పటికీ, కడప జిల్లా ఒంటిమిట్ట ఆలయం దగ్గర్లో, 'బమ్మెరగడ్డ' అనే చిన్న గ్రామం చెరువు కింద 'పోతన మడి' ఉంది.

శబ్దశాసనుడు, కవి సార్వభౌమ శ్రీనాథుడు, రెడ్డి రాజుల కాలంలో రాజభోగాలు అనుభవించాడు. ఒకరోజు పల్నాడు ప్రాంతంలో ప్రయాణం చేస్తూ, దాహంతో ఏదైనా చెరువు కన్పిస్తుందేమోనని ఎదురు చూసాడట! ఎక్కడా కన్పించలేదు. దాహం తీర్చే చెరువు కన్పించకపోతే, ఒక దగ్గర ఎండిపోయిన చెరువు కనబడితే, విమర్శ, ఫిర్యాదు వంటి ఓ చాటువును ఆశువుగా చెప్పాడట శ్రీనాథుడు.

'సిరిగల వానికిం జెల్లును
తరుణులు పదియారువేలు తగబెండ్లాడన్
తిరిపెన కిద్దరాండ్రా?
పరమేశా! గంగ విడువు పార్వతి చాలున్'

'కలిమి (సిరి) గలవాడు విష్ణుమూర్తి. అతడికి 16 వేల మంది పెళ్లాలున్నా పోషించగలడు. భిక్షాటన (తిరిపెం) చేసుకునేవాడివి. నీకెందుకు, ఇద్దరు పెళ్లాలు? నీకు పార్వతి చాలు.. గంగను మాకు విడిచిపెట్టు..' అని దెప్పి పొడిస్తే, వర్షం పడిందట! అనంతరం శివుడ్ని ప్రశంసించి, నమస్కరించి శ్రీనాథుడు వెళ్లిపోయాడట! ఆ కాలంలో కవులను నిరంకుశులుగా భావించేవారు. వారు కవిత్వం చెబితే, అనుకున్నవి జరుగుతాయని అనుకునేవారు. అది ఓ రకమైన పాండిత్య అహంకారం! కాకతాళీయంగా కొన్ని జరిగిపోయేవి.

శ్రీనాథుడు రాగి అయితే, పోతన విరాగి. జీవనోపాధికోసం పోతన కుటుంబం వ్యవసాయం చేసుకునేది. ఒక రోజు ఉదయం పల్లకీ మీద వెళుతున్న శ్రీనాథుడు, ఊరిబయట పొలంలో ఉన్నాడని తెలిసి పోతన దగ్గరకు వచ్చాడు. పోతన గట్టు మీద కూర్చొని పొలం దున్నుతున్న కొడుక్కి ఏవో సలహాలు



ఇస్తున్నాడు. పల్లకీ దిగిన తరువాత, 'హాలికులు కుశలమా?' అని చిన్న వ్యంగ్యంతో శ్రీనాథుడు పలకరించాడు. అది, ప్రజాకవి పోతనకు తెలియదా? జవాబుగా –

'బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
కూళలకిచ్చి యప్పడపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి? గహనాంతర సీమల గందమూల గౌ
ద్దాలికులైననేమి? నిజదార సుతోదర పోషణార్థమై' అని ఓ పద్యం చెప్పాడు.

(లేమామిడి, లేత చిగురాకు వంటి కోమలమైన కావ్య కన్యను మోటువాళ్లకు ఇచ్చి, వాళ్లిచ్చిన డబ్బుతో సంపాదించిన కూడు తినే కంటే, సత్కవులు వ్యవసాయదారులై స్వయంగా పండించుకు తింటేనేమి? అడవుల్లో తవ్వుగోలలతో కందమూలాలు తవ్వుకొని తింటేనేమి? తన పొట్ట పోసుకోవడం, భార్యాబిడ్డల్ని పోషించుకోవడానికి ఏ మార్గమైతేనేమి?)

ఆ జవాబుకు గూబ గుయ్యిమన్న శ్రీనాథుడు సర్దుకుని, 'సరేలే బావా! చుట్టాలం.. భోజనానికి వచ్చాం. పదండి ఇంటికి వెళదాం..' అని మాట మార్చాడు.

శ్రీనాథ మహాకవి కూడా వ్యవసాయం చేశాడు. కృష్ణా నదీతీరంలోని బొడ్డుపల్లి అనే గ్రామాన్ని గుత్తకు (కౌలుకు) తీసుకున్నాడు. ఒక ఏడాది వరద, మిడతల దండు వల్ల పంట నాశనమయింది. శిస్తు కట్టలేకపోయాడు. ఏలిన వారు ఊరుకుంటారా? నల్లగుండు రాయిని కవి సార్వభౌముని భుజాలకెత్తించి, ఊరేగించారు. అతిశయంగా అంతవరకూ బతికిన కవిరాజు, అవమాన భారంతో తన హృదయాన్ని ఇలా కవిత్వీకరించాడు.

'కవిరాజు కంఠంబు కౌగలించెను గదా
పురవీధి నెదురెండ బోగడ దండ
సార్వభౌముని భుజస్కంధమెక్కెను గదా
నగరి వాకిటనుండి నల్లగుండు
ఆంధ్ర నైషధకర్త యంఘ్రి యుగ్మంబున
దగలియుండెను గదా, వెదురు గడియ'

ఈ పద్యంలోనే, శిస్తు కట్టలేకపోవడానికి కారణాలు కూడా చెప్పాడు.

'కృష్ణవేణమ్మ గొనిపోయే నింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయె తిలలు, పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతు సుంకంబు నేడు నూర్లు?'

బిలబిలాక్షులంటే మిడతలు. ఏడు వందల వరహాల సుంకం (గుత్త). కవులు హాలికులైననేమి? వారి కష్టం కూడా సజీవ కవితా సంపదయింది.

జమిందారీ వ్యవస్థలో సాగుభూమి, నీటిపారుదల, శిస్తులు, వేధింపులకు సంబంధించి మంచి పద్య సాహిత్యం వెలువడింది. 17వ శతాబ్దం ఆరంభంలో కళింగాంధ్రలోని విజయనగరం సంస్థానంలో ఆడిదం రామకవి అనే శతక కవి ఉండేవారు. ఆయనకు 'రేగ' గ్రామంలో జమిందార్లు యెర్ర కృష్ణందేవ్, నల్ల కృష్ణందేవ్ అనేవారు కొంత మాన్యం ఇచ్చారు. రామకవి కరణీకం చేసేవారు. ఆ ఊర్లో అనుముల చెరువు, నోముల చెరువు ఉండేవి. రామకవి భూమి అనుమల చెరువు కింద ఉండేది. నోముల చెరువు వెనుక (బ్యాక్ వాటర్ ప్రాంతం) ఈ భూములుండేవి. నోముల చెరువు నిండిపోతే, ఈ భూములు మునిగిపోయేవి. రామకవి కరణీకం చేసినప్పుడు, దంతులూరి అన్నంరాజు అనే క్షత్రియుడు గ్రామ గుత్తేదారు. నోముల చెరువు ముంపు వల్ల భూములకు సమస్య లేకుండా, ఒక నీటి మళ్లింపు కాలువ (ఫ్లడ్ ఫ్లో కెనాల్) ఉండేది. అన్నంరాజు ఆ కాలువ మూసి వేయించాడు. ఒక ఏడాది పెద్ద వర్షాలు పడి చెరువు నిండిపోయింది. పొలాలు మునిగిపోయాయి. అన్నంరాజుకు రామకవి మొరపెట్టుకున్నాడు. అతడు పట్టించుకోలేదు. అప్పుడు, రామకవి విజయనగరం జమిందార్‌కు ఒక అర్జీ పెట్టుకున్నాడు. అదీ కవిత్వరూపంలోనే –

సీ. **'అవధారు! దేవ! మహాప్రభూ! విన్నపం**
బాశ్రితోత్తముండ, శుద్ధాంధ్ర కవిని
పేరు రామన, యింటిపేరడిదము వారు
మా జాగ, భూపాలరాజు రేగ
నల్ల కృష్ణమనాయికాగ్రేసరుం
డెర్రకృష్ణక్ష్మారవేంద్రులచట
గరణీక ధర్మంబు గల్పించి మాన్యంబు
దయచేసి రది యొస్పృదంబుమాకు

గీ. **నదియు నేయుడు దంతలూ రన్న నృపతి**
సత్తమందు గ్రామమెల్లను గుత్త చేసి
చెరువు బిగగట్టి ప్రజలు జేజీపడంగ
ముంపు గట్టించె వరి పొట్ట ముంపు దలంచి

(మహాప్రభూ! నా పేరు రామన. ఇంటిపేరు ఆడిదము. మా ఊరు భూపాలరాజురేగ. నలకృష్ణమరాజు, ఎర కృష్ణమరాజు అనే వారు, కరణీకమిచ్చి, కొంత పొలం ఇచ్చారు. ఈ ఏడాది అన్నంరాజు గ్రామమంతా గుత్తకు తీసుకుని, చెరువు బిగగట్టి ప్రజలు ఇబ్బంది పడేలా, వరిపొలాలు నీటిలో మునిగిపోయేలా చేసాడు. దుక్కిటెడ్లు కొందామంటే, ఎవరూ అప్పు ఇవ్వరు. పంటలేదు గానీ, పన్ను తప్పడం లేదు. మీకు దయ రాదు, మాకు మునుపటి కాంతి లేదు. ఓ విజయరామరాజా!)

అయితే, విజయరామరాజు కూడా ఈ కవితా విన్నపాన్ని పట్టించుకోలేదు. పొలంలో పొట్టతో ఉన్న వరి, మోకాలు పొడవు నీటిలో ఉంది. కవి, తనకు చాలా శక్తి ఉందనుకున్నాడు. గంగను (నీటిని) బతిమలాడాడు. ఆమె తప్పుల్ని ఎత్తి చూపాడు. నిందాస్తుతి పద్యాలు చెప్పాడు. బ్రాహ్మణుల భూమిలోకి ఎంతటి నీచులైనా ప్రవేశించరు... నువ్వెందుకు వచ్చావు? అని ప్రశ్నించాడు.

'నీకు విహారింప వసతులై నివ్వటిలెను
చిన్న పొలములు బ్రాహ్మణ క్షేత్రములకు
ఘాతకత్వంబు చేయు ముష్కరులు గలరె?
కదలు మిటమాని దివిజ గంగాభవాని?' అనిగర్జించాడు.

ఏం జరిగిందో, కాకతాళీయమో, నాలుగు తాటాకుల మీద సీస పద్యాలు రాసి, నాలుగు దిక్కులా వదిలాడు. చెరువుకు గండి పడిపోయింది. ముంపు నీరు దిగువకు పారిపోయింది. చేను సురక్షితమయింది. రామకవి పద్యాలు 'చెరువు పద్యాలు' పేరుతో ప్రసిద్ధికెక్కాయి.

జమిందారీ వ్యవస్థ, బ్రిటిష్ పాలనాకాలంలోనే, రెంట్ రికవరీ చట్టం (1865) వచ్చింది. జమిందార్లు రైతుల మీద కోర్టుల్లో కేసులు వేసి వేధించారు. వాటిని 'సమ్మరీదావాలు' అనేవారు. 1882లో రైతులు, జమిందార్ల హక్కులకు సంబంధించిన ఒక జీవో వచ్చింది. అయినా, జమిందార్ల దోపిడీ మనస్తత్వం మారలేదు. కూరగాయల మడులు, తోటల మీద పన్నులు వేశారు. జలాధారం గల భూముల మీద శిస్తులు పెంచారు. రైతుల ఆవేదన, ఆందోళనయింది. ఈ పన్నుల బాధ గురించి చిలకమర్తి లక్ష్మీనరసింహం చెప్పిన పద్యం...

'నేల దున్నుదమన్న జాలతరము పన్ను
నీరు గావలెనన్న నీటిపన్ను
వాణిజ్యమొనరింప వచ్చు బడికి పన్ను
సరుకులమ్ముదమన్న సంత పన్ను
కర్రలమ్ముదమన్న గలప కింకొక పన్ను
పట్టణంబుల మున్సిపాలు పన్ను
పారిపోవుదమన్న బండి హాసీల్ పన్ను
కొంపకమ్మున్నచో స్టాంపు పన్ను'

చివరికి రైతుకు మిగిలిందేమీ లేదని, రైతును అధికార యంత్రాంగం దోచుకుంటున్న విధానం మరో పద్యంలో చెప్పారు చిలకమర్తి.

'అధికార భూతంబు లడుగు లంచములిచ్చి
పరిపరి విధములౌ పన్నులిచ్చి
మునసబు, కరణాల ముడుపలన్నియునిచ్చి
కోసి, నూర్చినవారి కూలినిచ్చి
కచ్చేరి బంట్రోతు గముల కీనామిచ్చి
పాలేళ్లకును గొంత పంటనిచ్చి
యజమానునకు బంట నర్ధభాగంబిచ్చి
పైకమిచ్చినవాని వడ్డినిచ్చి
గడ్డి మాత్రమె మిగిలించు గాపువాడు
సేద్యమున దాను పశుల భక్షించుకొరకు
కటకటా! యెట్టులున్నదో గాపుల దశ
సుగుణ ధనులార జనులా చూడరయ్యా'

విజయనగరం సంస్థానంలో, గురజాడ సజీవులుగా ఉన్న రోజుల్లోనే, ప్రభుత్వ ఉద్యోగాల పనితీరు గురించి, 1896లో రాజామణిశెట్టి అనే ఓ కవి రాసిన శతకంలో...

'జీతంబునకు బనిసేయుదురే గాని
గౌర్నమెంటుకు మేలుగాన బోరు
జీతంబునకు బనిసేయుదురే గాని
జనులకు సౌఖ్యంబు సలుపబోరు
జీతంబునకు బనిసేయుదురే గాని
ధర్మంబు తప్పక దలపబోరు
జీతంబునకు బనిసేయుదురేగాని
యిహపర సౌఖ్యంబు లెన్నబోరు'

వర్తమాన భారతంలో రైతులు వ్యవసాయ స్థితిగతులకు పద్య సాహిత్య కాలరీతులను అన్వయించుకోవచ్చు, కొద్దిపాటి మార్పులు తప్ప! రామకవి విన్నప పద్యాల్లో ఒకటి.. నిర్వేదంగా బతికే ఉంది.

'విన్నవించెద నాదు వృత్తాంతమిది కొంత
చిత్తగింపు పరాకు సేయకుండ'

– నల్లి ధర్మారావు
76609 67313


వైవిధ్యభరితం.. సాంస్కృతిక భారతం...

రంగస్థలం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి ఏటా భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం వారితో కలిసి జాతీయ, అంతర్జాతీయ యువజన ఉత్సవాలు నిర్వహిస్తోంది. 37వ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక ఉత్సవాలు (2023–24) నార్త్ వెస్ట్ జోన్‌లో హర్యానా రాష్ట్రంలోని రోహతక్‌లోని మహర్షి దయానంద విశ్వవిద్యాలయం ఆవరణలో ఫిబ్రవరి 9 – 14 తేదీల్లో జరిగాయి. రంగస్థల కళల విభాగంలో నాటికలు, ఏకాంకికలు, మిమిక్రీ, మైమ్ అంశాలతో జరిగిన పోటీలకు గుణనిర్ణేతగా పాల్గొనే అవకాశం ఈ వ్యాసకర్తకు లభించింది.







నాటికల విభాగంలో మొత్తం 13 విశ్వవిద్యాలయాలు పాల్గొనగా, అందులో ఐదు ఉత్తమమైనవిగా ఎంపిక చేసి, వాటిలోని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వాటిని జాతీయ స్థాయి పోటీకి సిఫార్సు చేసింది. ఈ వ్యాసకర్తతో పాటు హైదరాబాదు నుంచి నిశుంబిత రామ్ హెబళగుంది, బీహార్ దర్భంగా నుంచి డాక్టర్ డాక్టర్ సుధీర్ కుమార్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ఏకాంకికలలో ప్రథమ స్థానంలో నిలిచిన 'ఉస్నే కహా థా' రచన, దర్శకత్వం విక్రమ్ జీత్ సింగ్. 'పావురాలకు ఏ మతం లేదు కాబట్టి సరిపోయింది. లేకుంటే ఆకాశం నుంచి రక్తపు వర్షం కురిసేది.' అని ఈ ప్రదర్శన చెబుతుంది. ఇది కురుక్షేత్ర విశ్వవిద్యాలయ సమర్పణ. రెండవ స్థానంలో నిలిచిన 'ది ఎడ్జ్ ఆఫ్ ద ఏజ్' చౌదరి దేవీలాల్ విశ్వవిద్యాలయం, సిర్సా వారిది. 12 ఏళ్ల బాలుడు తల్లి వ్యభిచరిస్తూ సంపాదించిన దానితో పొట్ట గడుపుకుంటూ ఉండటం వల్ల తన అస్తిత్వాన్ని, మానసిక స్థిరత్వాన్ని కోల్పోతాడు. హోటల్ యజమాని తనను పెట్టే హింస భరించలేక అతడిని హత్య చేస్తాడు. ఆ షాక్‌లో మూగవాడు అవుతాడు. పోలీసులు అరెస్టు చేసి డాక్టర్ శ్యాలి అనే మానసిక వైద్యురాలి పర్యవేక్షణలో ఉంచుతారు. ఆమె చూపిన ప్రేమ వల్ల అతడు తిరిగి తన మానసిక సంతులనాన్ని పొంది తన నేరం అంగీకరిస్తాడు. కోర్టు ఆరు నెలల శిక్ష విధించి, బాల నేరస్తుల కారాగారానికి పంపుతుంది. ఆ తర్వాత డాక్టర్ శాలిని నిర్వహిస్తున్న అనాథ బాలల ఆశ్రమంలో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు ఆ బాలుడు. మూడవ స్థానంలో ఆతిథ్యమిచ్చిన దయానంద విశ్వవిద్యాలయం విద్యార్థుల 'విఠలా' (దేవుడా? దెయ్యమా?) ప్రదర్శన నిలిచింది. జీవితంలో తమ ఆశయాన్ని నెరవేర్చుకున్న, నెరవేర్చుకోలేకపోయిన ఆ ఇద్దరి సంఘర్షణే ఈ నాటిక ఇతివృత్తం. రచయిత ఈ నాటిక ద్వారా సాంఘిక అసమానతలను, మతపరమైన ద్వంద్వ ప్రవృత్తిని, సందర్భ శుద్ధి కోల్పోయిన ఆచారాలను తీవ్రంగా ఖండిస్తాడు.

నాలుగో స్థానంలో రెండు నాటికలు నిలిచాయి. అందులో ఒకటైన 'అంతర్ ద్వంద్' ఇందిరాగాంధీ విశ్వవిద్యాలయం మీర్పూర్ వారి ప్రదర్శన. మగ శిశువుగా జన్మించినా మానసికంగా స్త్రీ స్వభావంతో పెరిగే చిన్నారులు ఎదుగుతున్న కొద్దీ వారిలోని ద్వంద్వ ప్రకృతి మానసిక సంఘర్షణకి దారితీస్తుంది. ఈ మహా సంగ్రామంలో లోపలి స్త్రీ ప్రకృతి విజయాన్ని సాధించడం ఈ నాటికలో అభివ్యక్తమైంది. మరో నాటిక మహిళా విశ్వవిద్యాలయమైన బనస్థలి విద్యాపీఠ్ సమర్పణ. ఇది ఏడుగురు మహిళలు ఉన్న కుటుంబంలో జరిగిన ఆధిపత్య– స్వాభిమాన స్వభావం గల వారి మధ్య సంఘర్షణను చూపిస్తుంది. ఇందులోని ఏడు పాత్రల ఏడు రకాల ప్రవర్తన వారి వారి ప్రేమలోని తేడాలను చూపుతుంది. అలా వారి మానసిక ఉద్వేగాలు ప్రేమలు, వాంఛలు, కోరికలు, అత్యాశలు, భయాలు, కోపాలు, ద్వేషం, అసూయల మధ్య సాగుతుంది. ఐదవ స్థానంలోని నాటిక 'రుక్మావతి కి హవేలీ' చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయం, భివాని వారి సమర్పణ. దీనిని నవరసాలతో చక్కగా తమ తమ పాత్రలు పోషించారు విద్యార్థినులు. ఇంకా ఈ ఏకాంకికలలో 'జిన్ లాహెూర్ న వేఖ్య'ను గురుగ్రామ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు మత సామరస్యాన్ని హృద్యంగా కళ్ళు చమర్చే విధంగా ప్రదర్శించారు. విభజన సమయంలో లక్నో నుంచి లాహెూర్ వెళ్లిన ఒక ముస్లిం కుటుంబం శరణార్థుల శిబిరంలో ఉన్న వారికి, ఒక ఇల్లు కేటాయిస్తారు. ఆ ఇంటిలో ఒక హిందూ వృద్ధ స్త్రీ మూర్తి మాత్రమే ఉంటూ ఖాళీ చేయనంటుంది. వీధిలోని గుండాలు ఆమెను ఖాళీ చేయించడానికి దౌర్జన్యానికి దిగబోతే ఆ ముస్లిం కుటుంబం వ్యతిరేకించి, ఆ వృద్ధురాలితో సఖ్యంగా ఉంటుంది. ఆమె మరణించగా హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తుంది. చౌదరి రన్బీర్ సింగ్ విద్యాలయం వారు 'ఏ రక్త్ జ్ హై' అనే ఏకాంకిక ప్రదర్శించారు. స్త్రీని బహిష్టు రోజుల్లో పూజాదికాలకు దూరంగా ఉంచడం, అస్పృశ్యులుగా చూడడం ప్రేక్షక హృదయాలను ద్రవింపచేసింది. 'ఇంటి దేవతను కాదని దేవాలయానికి వెళ్లి దేవత ఆశీస్సుల కోసం ఆరాటపడటంలోని వెర్రితనాన్ని' కరుణ రస ప్రధానంగా ప్రదర్శించారు.

స్కిట్స్ విభాగంలో 13 విశ్వవిద్యాలయాలు పాల్గొన్నాయి. 'కమాల్ కి సావిత్రి'లో ఈనాటి సావిత్రి యముడిని ఏవిధంగా అదుపు ఆజ్ఞలో పెట్టి భర్తప్రాణాలను తిరిగి ఎలా పొందిందో వ్యంగ్యాత్మకంగా చూపించారు. అమాయకుడికి అండగా నిలవాల్సిన మీడియా ఎలాంటి అవాంఛనీయ పాత్రను పోషిస్తుందో 'న్యాయ్' స్కిట్‌లో చూపించారు. 'ఫ్యామిలీ బిజినెస్' అనే స్కిట్ భిక్షావృత్తిగా గల కుటుంబంలోని ఒక వ్యక్తి 'లక్ష్మీనారాయణ బికారి లిమిటెడ్' పేరుతో దాన్ని కార్పొరేట్ వ్యాపారంగా మార్చి, భిక్షాటన ఎందరికి ఎన్ని విధాలుగా లాభిస్తుందో తన ఉపన్యాసంతో ముగిస్తాడు. మీడియా హౌసులు తమ పాత్రను నిజాయితీగా, నిస్పాక్షికంగా నిర్వహించినప్పుడే సామాజిక వికాసం కలుగుతుందని. 'న్యూస్ రూమ్ కి జల్వే' అన్న స్కిట్‌లో చెప్పారు. 'కుర్సీ కా ఖేల్' (కుర్చీలాట).. వైజ్ఞానిక దృక్పథం కంటే మూఢ విశ్వాసాలు, దొంగ బాబాల దోబూచులాటలు, మహిళల పట్ల అశ్లీల అసభ్య ప్రవర్తన, వరకట్న దహనాలు, వీటి నగ్న తాండవాన్ని చూపించింది. 'ఉల్లూ కే పట్టే' స్కిట్‌లో గుడ్లగూబలు కొన్ని– మనుషులు తమ కంటే బుద్ధిహీనులుగా వ్యవహరిస్తుండడాన్ని చూసి అందులో వారి దగ్గరే కొత్త విషయాలు నేర్చుకోవాలనుకుంటాయి. అంతిమంగా మానవత్వాన్ని మించిన జీవనసారం లేదని గ్రహిస్తాయి.

ఇలా వైవిధ్యభరితమైన ఇతివృత్తాలతో సాగిన ప్రదర్శనలు దేశ సాంస్కృతిక భిన్నత్వంలోని ఏకత్వాన్ని దర్శింపచేశాయి. ఉన్నత విద్యార్జనలో ఉన్న విద్యార్థులు రంగస్థల సాంస్కృతిక ప్రదర్శన కళల్లో తాము ఎవరికీ తీసిపోము అన్న భావాన్ని కలిగించారు. దక్షిణాది రంగస్థలంతో ఉన్న కొద్దిపాటి పరిచయానికి తోడు, ఉత్తరాది రంగస్థలం ఆధునిక పోకడలను చూసి అప్డేట్ కావడానికి నాకు ఈ అవకాశం చక్కని వీలు కల్పించింది.

– మల్లేశ్వరరావు ఆకుల,
79818 72655

తెలుగు సాహితీ వనం కథా పురస్కారాలు-2024

తెలుగు సాహితీ వనం 2024 సంవత్సరానికి గానూ కథా పురస్కారాల ఎంపిక కోసం నిర్వహించిన కథల పోటీకి సుమారు 150 కథలు వచ్చాయి. నలుగురు సభ్యుల ప్రాథమిక వడపోత అనంతరం ఆడెపు లక్ష్మీపతి, సత్యాజీ కథలను పరిశీలించి, పురస్కార కథలను ఎంపిక చేశారు. పురస్కార గ్రహీతలు : డా.ఎం.సుగుణారావు – విశాఖపట్నం (స్పర్శ); ఎం.సూర్య ప్రసాదరావు – ఖమ్మం (పంచప్రాణాలు); పులిపాక సీతాలక్ష్మి – గుంటూరు (మనసెరిగిన అత్తగారు); సుధాకళ్యాణి ఆచంట – సికింద్రాబాద్ (జనులా పుత్రుని పొగడగ). విజేతలకు జులైలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే తెలుగు సాహితీ వనం ఆరవ వార్షికోత్సవ సభలో పురస్కారాలు అందజేస్తారు. రూ.2116 నగదు బహుమతితో పాటు సభలో సన్మానం ఉంటుంది. ఈ పురస్కారాలను డా. విజయలక్ష్మి పండిట్, డా.గడ్డం శ్యామల, డా.పాతూరి అన్నపూర్ణ, శ్రీనివాస్ తొడుపునూరి అందిస్తున్నారు.

9న 'నానీ లోచనాలు' ఆవిష్కరణ

గడ్డం సులోచన రచించిన 'నానీ లోచనాలు' కవితా సంపుటి ఆవిష్కరణ సభ 9 మార్చి 2024 ఆదివారం ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్‌లో జరుగుతుంది. డా.ఎన్. గోపి ఆవిష్కరిస్తారు. ఆచార్య సూర్యా ధనంజయ్ అధ్యక్షత వహిస్తారు. డా. ఉదారి నారాయణ (ఆదిలాబాద్) కృతిని స్వీకరిస్తారు. కుడికాల వంశీధర్, డా. జి.ఆదినారాయణ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

జాతీయ సమైక్యతపై కథల పోటీ

స్వాతంత్ర్య అమృతోత్సవం జరుపుకుంటున్న తరుణంలో జాతీయ సమైక్యత అనే అంశంపై ఈ సంవత్సరం వాసా ఫౌండేషన్ సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో డా॥వాసా ప్రభావతి స్మారక జాతీయస్థాయి కథల పోటీ నిర్వహిస్తున్నాం. కథ ఎ4 సైజులో రాతప్రతిలో 4 పేజీలు, డిటిపి అయితే 3 పేజీలకు మించరాదు. ఒక్కొక్కరు ఒక్క కథను మాత్రమే పంపాలి. రచయిత వివరాలు హామీపత్రంపైనే వుండాలి. కథపై రచయిత వివరాలు ఉండరాదు. ప్రథమ బహుమతి రూ.5000, ద్వితీయ బహుమతి రూ.2500. రూ.1000 చొప్పున ఐదు ప్రత్యేక బహుమతులు ఉంటాయి. 2024 ఏప్రిల్ 30లోగా కథలు పోస్టు/ కొరియర్ ద్వారా పంపాలి. చిరునామా : డా. వాసా ప్రభావతి స్మారక కథల పోటీకి, సాహితీ కిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్

– ప్రకాష్ వాసా, పొత్తూరి సుబ్బారావు

5, 6 తేదీల్లో తెలుగు ప్రాచీన సాహిత్యంపై సమాలోచన

తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు–సమాలోచన" అనే అంశంపై మార్చి 5, 6 తేదీల్లో విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల సెమినార్ హాల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి బుర్రా వెంకటేశం, రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, ఆచార్య శైలేంద్ర మోహన్, ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి, ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, ఆచార్య సి.ఆరతి, ఆచార్య పి. కనకయ్య తదితరులు పాల్గొంటారు. వివిధ అంశాలపై పత్ర సమర్పణలు , ప్రసంగాలూ జరుగుతాయి.

– తెలంగాణ విశ్వవిద్యాలయం

బిజెపికి బుద్ధి చెప్పాలి

- జన విశ్వాస్ సభలో నేతల పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని ఇండియా ఫోరం నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం పాట్నాలో జరిగిన జనవిశ్వాస్ సభలో దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న విభజన, మతతత్వ రాజకీయాలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తొలుత బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మోడీ అసలు హిందువే కాదన్నారు. కొంత కాలం క్రితం తన తల్లి చనిపోయినప్పుడు మోడీ గుండు ఎందుకు గీసుకోలేదని అన్నారు. తల్లి లేదా తండ్రి చనిపోయినప్పుడు గడ్డం తీసేసి, గుండు చేయించుకోవడం హిందువుల్లో ఒక ఆచారం అని, మోడీ ఆ పని ఎందుకు చేయలేదని లాలూ ప్రశ్నించారు. బిసీల అభ్యున్నతికి బీహార్‌లోనే కాదు, దేశవ్యాప్తంగా తాను కృషి చేస్తానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని మట్టికరిపిస్తామని ప్రతిన బూనారు. "ఈ గాంధీ మైదాన్‌లో దేశం నలుమూలల నుంచి వచ్చిన నేతల సమావేశాలు ఎన్నిసార్లు జరిగాయో తెలియదు. ఇక్కడి నుంచి దేశమంతటా సందేశం వెళ్లింది. బీహార్ గాలిలో చాలా బలం ఉంది. దేశ ప్రజలు దానిని అనుకరిస్తారు" అని అన్నారు.


జనవిశ్వాస్ సభలో అభివాదం చేస్తున్న డి.రాజా, సీతారాం ఏచూరి, ఖర్గే, లాలూ ప్రసాద్ యాదవ్, రాహుల్ గాంధీ, తేజస్వీయాదవ్, అఖిలేష్ యాదవ్ తదితరులు

బీహార్ మాజీ డిప్యూటీ సిఎం తేజస్వీ యాదవ్ మాట్లాడుతూ బిజెపి అబద్ధాల ఫ్యాక్టరీ అని, ఆర్‌జెడి హక్కులు, ఉద్యోగాలు, అభివృద్ధి కోసం పనిచేసే పార్టీ అని అన్నారు. 17 ఏళ్లలో నితీష్‌కుమార్, బిజెపి చేయలేనిది, తమ మద్దతుతో నడిచిన 17 నెలల్లో రాష్ట్రానికి చేయగలిగామని గుర్తు చేశారు. తమ పార్టీ వెనుకబడిన, మైనారిటీ వర్గాల ప్రజల కోసమే పనిచేస్తుందని చెప్పారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "పిఎం మోడీ 'మేరా గ్యారెంటీ' అని చెప్పారు, ఇకపై 'బిజెపి లేదా ప్రభుత్వ హామీ' అని చెప్పరు. ఇప్పుడు నేను మీకు ప్రధాని మోడీ హామీలను చెబుతాను. 2014లో ఈ దేశ యువతకు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, అలా చేశారా? అందరికీ 'పక్కా' ఇల్లు కట్టిస్తానని కూడా చెప్పాడు, అలా చేశాడా? ఆయన, ఆయన పార్టీ హామీ ఈ దేశ ప్రజలకు ద్రోహం చేయడమేనని, అవాస్తవాలతో తారుమారు చేయడమేనని చెప్పారు.

"నేడు, ఇండియా ఫోరం బిజెపిని యుద్ధభూమిలో ఎదుర్కొంటోంది. కేంద్ర ఏజెన్సీలతో బిజెపి ప్రతిపక్షాల్లో భయాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తోంది. మేము వారి ముందు తలవంచడానికి ఇక్కడ లేము లేము. అది సాధ్యం కాదు" అన్నారు.

రాహుల్ గాంధీ మాట్లాడుతూ బీహార్ దేశ రాజకీయాలకు నాడీ కేంద్రమని అన్నారు. దేశంలో పెను మార్పులు బీహార్ నుండే ప్రారంభమయ్యాయని, మన దేశంలో విద్వేషాలకు తావు లేదని అన్నారు.

రాజ్యాంగ పరిరక్షకులు, రాజ్యాంగ భక్షకుల మధ్య పోటీ: అఖిలేష్ యాదవ్

2024లో 'రాజ్యాంగ మథనం' జరగబోతోందని, ఒకవైపు రాజ్యాంగ పరిరక్షకులు, మరోవైపు రాజ్యాంగ భక్షకులు (రాజ్యాంగాన్ని నాశనం చేసే వ్యక్తులు)" అని ఎస్‌పి అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ అన్నారు. "కేంద్రం నుంచి బిజెపిని గద్దె దించాలి. యుపిలో 80 లోక్‌సభ సీట్లు, బీహార్‌లో 40 సీట్లు, ఈ మొత్తం 120 సీట్లలో బిజెపిని ఓడించాలి. అప్పుడు కేంద్రంలో బిజెపి అధికారం కోల్పోతుంది. 120 సీట్లలో బిజెపిని ఓడించి, దేశాన్ని రక్షించాలి" అని పిలుపునిచ్చారు.

మహాకూటమి ప్రభుత్వ హయాంలో తేజస్వి 17 నెలల్లో మూడు లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, తేజస్వి అధికారంలో ఉండి ఉంటే 10 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చి ఉండేవారని తెలిపారు. "రైతులు సంతోషంగా లేరని, యువతకు ఉద్యోగాలు లేవని, వారి పదేళ్ల పదవీకాలంలో ప్రజలకు సాధించిన ఘనత ఏమిటి? యుపితో పాటు బీహార్ కూడా మార్పు దిశగా అడుగులు వేస్తుంది" అని అన్నారు.

రాష్ట్ర రాజధాని అంతటా కటౌట్లు, పోస్టర్లు, బ్యానర్లతో నిండిపోయింది. ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తున్నప్పటికీ ఆర్‌జెడితోపాటు ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మోడీ నియంతృత్వాన్ని ఎదిరిస్తేనే దేశాన్ని రక్షించగలం: సీతారాం ఏచూరి

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ, మోడీ నియంతృత్వాన్ని ఎదిరించకపోతే దేశాన్ని రక్షించలేమని అన్నారు. "మోడీ హామీ జీరో గ్యారెంటీ. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అందుకే రైతులు మళ్లీ నిరసనకు దిగాల్సి వచ్చింది" అని అన్నారు. సాగర మథనంతో వచ్చిన అమృతం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లినట్లు, దేశంలో అధికారం తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని అన్నారు. ఆ అమృతాన్ని తిరిగిపొంది, ప్రజలకు మంచి భవిష్యత్తును అందించడానికి, దేశాన్ని రక్షించడానికి వినియోగించాలని చెప్పారు. మోడీ హఠావో, దేశ్ బచావో అని పిలుపునిచ్చారు.

80 శాతం ప్రజలకు ద్రోహం చేసేలా రైల్వే విధానాలు : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : 80 శాతం మంది ప్రజలకు ద్రోహం చేసేలా మోడీ ప్రభుత్వం రైల్వే విధానాలను రూపొందిస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శించారు. దోపిడీని దాచిపెట్టేందుకే రైల్వే బడ్జెట్‌ను ప్రత్యేకంగా సమర్పించే సాంప్రదాయానికి మోడీ ప్రభుత్వం స్వస్తి పలికిందని 'ఎక్స్'లో ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'హవాయి చెప్పులు' ధరించిన వారిని 'హవాయి జహాజ్ (విమానం)'లో ప్రయాణించేలా చేయాలన్న కలను ప్రజలకు చూపిస్తూ.. ప్రధాని మోడీ వారిని 'గరీబోంకి సవారీ' (పేదల వాహనం) రైల్వేల నుంచి దూరం చేస్తున్నారని విమర్శించారు. "ప్రతి ఏడాది 10శాతం ఛార్జీలు పెంచడం, డైనమిక్ ఛార్జీల పేరుతో దోపిడీ, టికెట్ కేన్సిలేషన్ ఛార్జీల పెరుగుదల, ఖరీదైన ప్లాట్ ఫారమ్ టిక్కెట్లతో పేదలు అడుగు కూడా వేయలేని 'ఉన్నతవర్గం రైలు' చిత్రాన్ని చూపించి ప్రజలను మభ్యపెడుతున్నారు" అని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లకు ఇచ్చిన రాయితీలను రద్దు చేసి, గత మూడేళ్లలో ప్రభుత్వం వారి నుండి రూ.3,700 కోట్లు దోచుకుందని తెలిపారు. ప్రచారం కోసం ఎంపిక చేసిన రైళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం కోసం సామాన్యుల రైళ్లను తగ్గిస్తున్నారని అన్నారు. ఎసి కోచ్‌ల సంఖ్యను మూడు రెట్లు పెంచి, జనరల్ కోచ్‌ల సంఖ్యను తగ్గిస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోడీని విశ్వసించడమంటే ద్రోహానికి గ్యారెంటీ ఇవ్వడమేనని పేర్కొన్నారు.

యువకుడిపై లాఠీతో ఎమ్మెల్యే ప్రతాపం

- శివసేన షిండే గ్రూపు ఎమ్మెల్యే తీరుపై సర్వత్రా ఆగ్రహం



ముంబై : పోలీసుల చేతిలో నుంచి లాఠీ తీసుకుని, ఓ యువకుడిని శివసేన ఎమ్మెల్యే దారుణంగా కొట్టిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. శివసేన ఏక్‌నాథ్ షిండే గ్రూపు నాయకుడు, బుల్దానా ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ యువకులను కొట్టారు. ఆ యువకుడు దేశద్రోహుల మధ్య ఉన్నాడని ఆరోపించాడు. గత నెల 19న బుల్దానాలో శివ జయంతి వేడుకల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. వీడియోలో, ఎమ్మెల్యే యువకులను కొట్టాలని పోలీసులను కోరడం, తరువాత లాఠీ పట్టుకుని యువకులను కొట్టడం కనిపిస్తుంది. ఈ వీడియో వైరల్ కావడంతో ఎమ్మెల్యేపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని యువకులను కొట్టారని, ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. గతంలోనూ ఎమ్మెల్యే సంజయ్ పలు వివాదాల్లో చిక్కుకున్నారు. 1987లో పులిని వేటాడి మెడలో దంతాలు వేసుకున్నానని ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ ప్రజావేదికలో చెప్పారు. దీంతో అటవీశాఖ ఆయనపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసింది. ఎమ్మెల్యే మెడలో ధరించిన పులి దంతాన్ని ఫోరెన్సిక్ పరీక్షల నిమిత్తం పంపించారు. దీనిపై విచారణ జరుగుతోంది.

పరిచయం లేని మహిళను అలా పిలిస్తే లైంగికంగా వేధించినట్లే : కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: మహిళలను నోటికొచ్చినట్టు పిలిస్తే జైల్లో ఊచలు లెక్కబెట్టాల్సి వస్తుందని కలకత్తా హైకోర్టు హెచ్చరించింది. మహిళలతో మాట్లాడేటప్పుడు నోరు దగ్గర పెట్టుకోవాల్సిన అవసరం చాలా ఉందని న్యాయస్థానం గుర్తుచేసింది. ముఖ్యంగా పరిచయం లేని మహిళలను 'డార్లింగ్' అని పిలవడం లైంగికంగా వేధించడమే అవుతుందని కోర్టు వ్యాఖ్యానించింది. అలా పిలిస్తే ఐపిసి 354 ఎ, 509 సెక్షన్ల కింద నేరస్థులుగా పరిగణించవచ్చని పేర్కొంది. ఈ మేరకు పోర్టు బ్లెయిర్‌లోని హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ జై సేన్‌గుప్తా తీర్పు వెలువరించారు. గతేడాది అండమాన్ నికోబార్‌లోని మాయాబందర్ ప్రాంతంలో దుర్గా పూజ సందర్భంగా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. విధుల్లో ఉన్న ఒక మహిళా కానిస్టేబుల్‌తో జనక్ రామ్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడు. మద్యం మత్తులో ఉన్న అతను ఆమెను డార్లింగ్ అని సంబోధించాడు. అంతేగాక 'చలాన్ ఇవ్వడానికి వచ్చావా..?' అంటూ దురుసుగా మాట్లాడాడు. మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీనిపై విచారణ చేపట్టిన నార్త్-మిడిల్ అండమాన్ ఫస్ట్ క్లాస్ కోర్టు జనక్ రామ్‌ను దోషిగా తేల్చింది. మూడు నెలల జైలు శిక్షతోపాటు రూ.500 జరిమానా విధించింది. ఈ తీర్పును అడిషనల్ సెషన్స్ కోర్టులో జనక్‌రామ్ సవాల్ చేయగా ఆ కోర్టు కూడా తీర్పును సమర్థించింది. దాంతో కలకత్తా హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు సైతం ఫస్ట్‌క్లాస్ కోర్టు తీర్పును సమర్థించింది. డార్లింగ్ అని పిలవడం లైంగిక వేధింపేనని తేల్చి చెప్పింది.

పాక్‌లో వర్ష బీభత్సం

- 29 మంది దుర్మరణం

పెషావర్: పాకిస్తాన్‌లో గత 48 గంటలుగా కురుస్తున్న వర్షాలు పెను బీభత్సాన్ని సృష్టించాయి. ఇప్పటివరకు అందిన సమాచారాన్ని బట్టి 29 మంది మరణించారు. మరో 50 మంది గాయపడ్డారు. పలు ఇళ్లు కూలిపోయాయి. కొండచరియలు విరిగిపడి రోడ్లకు అడ్డంగా పడిపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. వాయువ్య ప్రాంతంలో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని వివిధ ప్రాంతాల్లో ప్రాణ, ఆస్తినష్టం ఎక్కువగా ఉందని ప్రావిన్షియల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఒక ప్రకటనలో తెలిపింది. సహాయక చర్యలు చురుగ్గా సాగుతున్నాయి. రహదారులపై కూలిన చెట్లను, చెత్తను తొలగించడానికి భారీ యంత్రాలను ఉపయోగిస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఉత్తరాదికి వెళ్లవద్దని అధికారులు పర్యాటకులకు సూచించారు. గత వారం, భారీ వర్షాల కారణంగా అనేక మంది సందర్శకులు అక్కడ చిక్కుకుపోయారు.

ఈ వారంలోనే హౌరా మైదాన్ -ఎస్ప్లానేడ్ సెక్షన్ ప్రారంభం

కోల్‌కత్తా : ఈ వారంలోనే కోల్‌కత్తా మెట్రోలోని హౌరా మైదాన్- ఎస్ప్లానేడ్ సెక్షన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు. ఈ సెక్షన్‌ను దేశంలోనే ఒక ప్రముఖ నది కింద మొదటి రవాణా సొరంగంగా ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సెక్షన్‌తో పాటే కోల్‌కత్తా మెట్రోలోని కవి సుభాష్-హేమంత ముఖోపాధ్యాయ సెక్షన్‌ను, తరతల-మజెర్‌హట్ మెట్రో సెక్షన్‌ను కూడా ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నెల 4 ,5, 6 తేదీల్లో తెలంగాణ, తమిళనాడు, ఒడిషా, పశ్చిమ బెంగాల్, బీహార్‌ల్లో మోడీ పర్యటించనున్నారు. హౌరా మైదాన్- ఎస్ప్లానేడ్ సెక్షన్ మార్గం హుగ్లీ నది కింద నుంచి వెళుతుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య దూరం 4.8 కిలోమీటర్లు.

ఆరని కార్చిచ్చు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో టెక్సాస్ విలవిల

టెక్సాస్: వారం రోజుల క్రితం టెక్సాస్ అడవులను అంటుకున్న మంటలు అడ్డు అదుపు లేకుండా వ్యాపిస్తూనే ఉన్నాయి. కార్చిచ్చును అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా పోరాడుతున్నప్పటికీ ఫలితం అంతగా కనిపించడం లేదు. శనివారం కార్చిచ్చు మరిన్ని ప్రాంతాలకు విస్తరించింది. దీంతో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోయాయి. వేడి గాలులతో టెక్సాస్ ప్రజలు విలవిలలాడుతున్నారు. టెక్సాస్ చరిత్రలో అతిపెద్ద కార్చిచ్చుగా దీనిని అధికారులు పేర్కొంటున్నారు. నైరుతి నుండి వీస్తున్న గాలులు ఈ కార్చిచ్చుకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఈ మంటలకు ఇప్పటికే ఇద్దరు బలయ్యారు. మూగ జీవాలు కూడా పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. 1,700 చదరపు మైళ్ల (4,400 చదరపు కిలోమీటర్లు) మేర అడవులు కాలి బూడిదయ్యాయి. బలమైన గాలులు, ఎండిన గడ్డి, పెరిగిన ఉష్ణోగ్రతలే కార్చిచ్చు రేగడానికి కారణమని భావిస్తున్నారు. టెక్సాస్ అగ్రికల్చర్ కమీషనర్ సిడ్ మిల్లర్ మాట్లాడుతూ, మంటల కారణంగా వ్యక్తిగత పచ్చిక బీడులు పూర్తిగా నాశనమయ్యాయి. పశువుల పరిశ్రమ దెబ్బతింది. ఫలితంగా గొడ్డు మాంసం ధరలు అమాంతంగా పెరిగిపోయే ప్రమాదం ఉంది.

తెహ్రీక్ ఉల్ ముజాహిదీన్ చీఫ్ అనుమానాస్పద మృతి

ఇస్లామాబాద్: ఉగ్రవాదుల జాబితాలో ఉన్న తెహ్రీక్ ఉల్ ముజాహిదీన్ కమాండర్ షేక్ జమీల్ ఉర్ రెహ్మాన్ అనుమానాస్పద స్థితిలో మతి చెందాడు. అతను కాశ్మీర్‌లోని పుల్వామాకు చెందినవాడు. షేక్ జమీల్ యునైటెడ్ జిహాద్ కౌన్సిల్ సెక్రటరీ జనరల్. ఉగ్రవాద సంస్థ తెహ్రీక్ ఉల్ ముజాహిదీన్ అధిపతి. ఆయన మతికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదని అధికారులు తెలిపారు. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐతో కలిసి పనిచేసిన జమీల్ కాశ్మీర్ కేంద్రంగా పలు ఉగ్రవాద దాడులకు పాల్పడ్డాడని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి.

మిస్సోరి కాకస్‌లో ట్రంప్ గెలుపు

- 5న సూపర్ ట్యూజ్‌డే

వాషింగ్టన్ : వచ్చే నవంబరు5న జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న పోరులో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖాతాలో మరో కాకస్ వచ్చి చేరింది. శనివారం జరిగిన మిస్సోరి కాకస్ ఎన్నికలో తన ప్రత్యర్థి నికీ హేలిపై స్పష్టమైన ఆధిక్యత కనబరిచారు. ఇంతకుముందు అయోవా, న్యూ హాంప్‌షైర్, నెవాడా, సౌత్ కరోలినా ప్రైమరీస్‌ను ఆయన గెలుచుకున్నాడు.కీలక స్వింగ్ రాష్ట్రమైన మిచిగాన్‌లో గత మంగళవారం నిర్వహించిన రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికల్లో ట్రంప్ 68 శాతానికి పైగా ఓట్లతో విజయం సాధించాడు.మిస్సోరి కాకస్‌ను గెలుచుకోవడం ద్వారా రిపబ్లికన్ కన్వెన్షన్‌కు ఆయన ఎక్కువ మంది ప్రతినిధులు కలిగి ఉంటారు.ఇప్పటి వరకు జరిగిన ప్రైమరీస్, కాకస్ పోటీల్లో 100 మందికి పైగా ప్రతినిధులను సేకరించిన ట్రంప్, రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం1,215 మంది డెలిగేట్లను సాధించాల్సి ఉంటుంది. సూపర్ మంగళవారం నాడు దాదాపు 15 రాష్ట్రాల్లో ఒకేసారి ప్రైమరీస్, కాకస్ ఎన్నికలు జరుగుతాయి. రిపబ్లికన్ లేదా డెమొక్రాటిక్ సమావేశాలకు దాదాపు మూడింట ఒక వంతు మంది ప్రతినిధులను పంపే అ ఆ రోజు ఎన్నుకుంటారు. 2020 ఎన్నికల ఫలితాలను అంగీకరించకుండా తిరుగుబాటుకు ట్రంప్ చేసిన యత్నాలపై ఆయనను ప్రాసిక్యూట్ చేయాల లేదా అనే అంశంపై సుప్రీంకోర్టు ఈ వారంలో రూలింగ్ ఇవ్వనుంది. ప్రచారంలో చురుగ్గా పాల్గొనాల్సి ఉన్నందున తనపై చట్టపరమైన చర్యలను వాయిదా వేయాలని ట్రంప్ కోరుతున్నాడు.

150 బ్యాంక్ ఖాతాలను పరిశీలించిన ఇడి

న్యూఢిల్లీ : అంతర్జాతీయ స్మగ్లింగ్ సిండికేట్ నేరాలకు సంబంధించిన సుమారు 150 బ్యాంక్ ఖాతాలను ఇడి పరిశీలించింది. ముంబయి పోలీసులు నమోదు చేసిన ఒక కేసు ఆధారంగా ఇడి ఈ కేసును విచారిస్తోంది. ఈ కేసులో దాదాపు రూ.44.50 కోట్ల విలువైన అక్రమాలు జరిగాయని ఇడి అధికారులు అంచనాకు వచ్చారు. జనవరిలో అరెస్టు చేసిన కీలక నిందితుడు అలీ అస్గర్ షిరాజీకి సంబంధించిన వ్యక్తులు, సంస్థలు పేరుతో ఈ బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

ఊరట ఇవ్వని ఆఖరి కేబినెట్

(మొదటిపేజీ తరువాయి)

వ్యవధిలోనే 2024 లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వస్తుందని, ఈ నోటిఫికేషన్‌కు ముందు ఆదివారం జరిగే సమావేశమే ప్రస్తుత మోడీ ప్రభుత్వ మంత్రివర్గానికి ఆఖరి క్యాబినేట్ సమావేశంగా వార్తలు వచ్చాయి. సాధారణంగా బుధవారం జరిగే క్యాబినేట్ భేటీ ఎన్నడూ లేని విధంగా ఈసారి ఆదివారం నిర్వహించడంతో సహజంగానే ఈ సమావేశంపై ఆసక్తి నెలకొంది.. కనీసం ఎన్నికలకు ముందైనా ఎలాంటి సంక్షేమ పథకమైన ప్రకటిస్తారని ఆశించినవారికి నిరాశే మిగిల్చింది. మోడీ మూడోసారి గెలవడం గురించే ఎక్కువగా మాట్లాడారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి వంద రోజుల్లో చేయాల్సిన పనులు గురించి తన మంత్రులకు హితబోధ చేశారు. 'వికసిత్ భారత్ 2047' రోడ్ మ్యాప్ అంటూ హడావిడి చేశారు. . సుమారు రెండున్నర ఏళ్లు కష్టపడి ఈ రోడ్ మ్యాప్ తయారు చేసినట్లు చెప్పారు. ఈ ప్రక్రియను నీతి ఆయోగ్ ముందుండి నడిపించిందని అన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, పౌర సంఘాలు, శాస్త్రీయ సంఘాలతో విస్తృతంగా సమావేశాలు జరిపి, వాటి ఆలోచనలు, సూచనలు, ఇన్‌పుట్లు స్వీకరించిన తరువాత ఈ రోడ్‌మ్యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న చేయలేవన్నీ మూడో పర్యాయం అధికారంలోకి రాగానే ప్రారంభిద్దామని మోడీ తన మంత్రుల ముందు డబ్బాలు కొట్టారు. మొత్తానికి మోడీ క్యాబినెట్ చివరి భేటీ కూడా ప్రజలను నిరాశపర్చిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

10న దేశవ్యాప్తంగా రైల్ రోకో

- 6న ఢిల్లీలో ఆందోళనలు
- రైతు ఆందోళన కార్యాచరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఈ నెల 6న ఢిల్లీలో నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని, 10న దేశవ్యాప్తంగా రైల్ రోకోలు చేపట్టాలని పిలుపునిచ్చాయి. ఈ మేరకు రైతు సంఘాల నేతలు సర్వన్ సింగ్ పంధేర్, జగ్జీత్ సింగ్ డాల్లేవాల్ ఇటీవల పోలీసుల కాల్పుల్లో మరణించిన యువ రైతు శుభకరన్ సింగ్ స్వగ్రామం బల్లోహ్లో సంతాప సభ అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న నిరసన కేంద్రాల వద్ద రైతుల ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చేవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శంభు, ఖానౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద జరుగుతున్న ఆందోళనకు పంజాబ్, హర్యానా రైతులు మద్దతు కొనసాగిస్తుండగా.. 6న ఇతర రాష్ట్రాలకు చెందిన రైతులు, రైతు కూలీలు రాజధాని ఢిల్లీకి చేరుకుని నిరసనలో పాల్గొనాలని రైతు సంఘాలు నిర్ణయించాయని కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) నేత సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు. ట్రాక్టర్ ట్రాలీల్లో చేరుకోలేని దూర రాష్ట్రాల రైతులు రైళ్లు, ఇతర రవాణా మార్గాల ద్వారా ఢిల్లీకి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళనను దేశవ్యాప్తంగా విస్తరించేందుకు రెండు ఫోరమ్‌లో 10న మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేశంలో రైల్ రోకో చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చినట్లు పంధేర్ తెలిపారు. రైతుల డిమాండ్లకు మద్దతుగా అన్ని పంజాబ్ పంచాయతీలు తీర్మానం చేయాలని, ప్రతి గ్రామం నుంచి ఒక ట్రాక్టరు ట్రాలీ సరిహద్దు పాయింట్ల వద్దకు చేరుకుంటుందని తెలిపారు. ఢిల్లీ చలో మార్చ్‌ను అడ్డుకునేందుకు కేంద్రం అన్ని వ్యూహాలూ పన్నిందని విమర్శించారు.



ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలు పంజాబ్‌కే పరిమితమని, రెండు ఫోరమ్‌లే ఈ పోరాటాన్ని నడిపిస్తున్నాయన్న అభిప్రాయాన్ని కల్పించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని పంధేర్ విమర్శించారు. దేశంలోని 200 కంటే ఎక్కువ రైతు సంఘాలు ఈ రెండు ఫోరమ్‌లలో భాగమేనని గుర్తు చేశారు. రైతుల సమస్యల్ని పరిష్కరించడం కేంద్రానికి ఇష్టం లేదని, ఎన్నికల్లో గెలిచేందుకు బిజెపి విభజన రాజకీయాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే ఆందోళనలు తగ్గుముఖం పడతాయన్న అభిప్రాయం సరైంది కాదని, తమ హక్కుల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగాన్ని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుటిఒ) పరిధి నుంచి తీసేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారం కోసం ఆఖరి శ్వాస వరకు పోరాడతామని జగ్జీత్ సింగ్ డాల్లేవాల్ అన్నారు. ఈ ఆందోళనలు పంజాబ్‌కు మాత్రమే పరిమితమని వాదించేవారు, హర్యానా సరిహద్దుల్లో కర్ఫ్యూ వంటి పరిస్థితిని ఎందుకు విధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగానే తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. రైతు శుభకరన్ సింగ్ త్యాగం వృథా కాదని పేర్కొన్నారు.

జమ్ముకాశ్మీర్‌లో భారీ వర్షాలు

- కొండచరియలు విరిగిపడి తల్లీబిడ్డల దుర్మరణం
- పలుచోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొండచరియలు విరిగిపడటంతో ఇల్లు కూలి, ఆ ఇంటిలో నిద్రిస్తున్న మహిళ, ఆమె ముగ్గురు కుమార్తెలు ప్రాణాలు కోల్పోయారు. జమ్ముకాశ్మీర్‌లోని రియాసీ జిల్లా మహౌర్ సబ్ డివిజన్ చస్సాన తహసీల్‌లోని కుందర్ధన్ మోహ్రా గ్రామంలో ఈ దుర్ఘటన జరిగినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఫల్లా అఖ్తర్ (30), ఆమె కుమార్తెలు నసీమా (5), సఫీనా కౌసర్ (3), సమీన్ కౌసర్ (3) మరణించినట్లు చెప్పారు. అదే ఇంటిలో ఉన్న వృద్ధులు ఖలు, అతని భార్య భానోబేగం తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను తొలగించి గాయపడిన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు.

జమ్ము రైల్వేస్టేషన్ వద్ద నిలిచిన వాహనాలు



మూడు రోజులుగా భారీ వర్షాలు

జమ్ముకాశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. బలమైన గాలులు, వడగళ్ల వాన, కొండ చరియలు విరిగిపడటంతో పలు ప్రాంతాల్లో నివాస గృహాలతోసహా పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. కొండచరియలు విరిగిపడటంతో జమ్ము - శ్రీనగర్ హైవేపై ట్రాఫిక్ నిలిచిపోయింది.

ప్రతిపక్ష పార్టీలపై అణచివేత సాగదు

- బిజెపిపై ఉద్ధవ్ థాకరే ఆగ్రహం

ముంబయి : ప్రతిపక్ష పార్టీలను అణిచివేసే బిజెపి విధానం ఇక సాగదని శివసేన (యుబిటి) అధ్యక్షులు ఉద్ధవ్ థాకరే స్పష్టం చేశారు. ధారవిలో ఆదివారం నిర్వహించిన ఒక సమావేశంలో ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చివేసే విధానాన్ని దేశం ఇక భరించలేదని తెలిపారు. బిజెపి ఇటీవల విడుదల చేసిన లోక్‌సభ అభ్యర్థుల తొలి జాబితాలో నితిన్ గడ్కరీ వంటి సీనియర్ నాయకులకు స్థానం లేకపోయినా మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కృపాశంకర్ సింగ్ వంటి వారికి స్థానం ఇవ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ మాట్లాడుతూ కృపాశంకర్ సింగ్‌కు ఎంపి టిక్కెట్ రావడానికి మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్ కారణమని విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఎదుర్కొనడానికి ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని కోరారు.

సియోల్‌లో డాక్టర్ల భారీ ర్యాలీ

సియోల్ : మెడికల్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్యను భారీగా పెంచాలన్న ప్రభుత్వ .యోచనకు వ్యతిరేకంగా గత రెండు వారాలుగా సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లకు మద్దతుగావేలాది మంది సీనియర్ వైద్యులు ఆదివారం సియోల్‌లో ర్యాలీ నిర్వహించారు జూనియర్ డాక్టర్లు తమ సమ్మె విరమించి తక్షణమే విధుల్లోకి చేరాలని, లేని పక్షంలో వారి మెడికల్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దిగిన నేపథ్యంలో సీనియర్ వైద్యులు ఈ ర్యాలీ నిర్వహించారు.ప్రభుత్వ అసంబద్ధమైన వైద్య విధానాన్ని ట్రైనీ వైద్యులు , వైద్య విద్యార్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దయచేసి బెదిరింపులు, అణచివేతను ఆపండి." అని కొరియా మెడికల్ అసోసియేషన్‌లో సీనియర్ సభ్యుడు పార్క్ సంగ్-మిన్ ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ పథకాన్ని విమర్శిస్తూ నిరసనకారులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ర్యాలీ సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంచనీయ సంఘటన చోటుచేసుకోలేదు. చాలా క్రమశిక్షణా యుతంగా ర్యాలీ జరిగింది. సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లు మొత్తం వైద్యులలో 30-40 శాతం దాకా ఉన్నారు, శిక్షణ , శస్త్రచికిత్సల్లో సీనియర్ వైద్యులకు వీరు సహాయం చేస్తారు. వారి వాకౌట్‌ల కారణంగా ఆసుపత్రులలో చాలా వరకు శస్త్రచికిత్సలు , వైద్య సేవలు నిలిచిపోయాయి. యువ వైద్యులకు మద్దతుగా సీనియర్ వైద్యులు వరుస ర్యాలీలు నిర్వహించారు. సమ్మెలో ఇంకా చేరలేదు. వారు కూడా


ఆందోళన చేస్తున్న డాక్టర్లు

సమ్మెలో పాల్గొంటే దక్షిణ కొరియా వైద్య వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోతుంది.

దేశంలో వద్ధాప్య జనాభా వేగంగా పెరుగతుతున్నందున ఆరోగ్య రంగంలో ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు వచ్చే విద్యా సంవత్సరం నుండి 2,000 ఎంబిబిఎస్ సీట్లను అదనంగా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత 3,058 నుండి. అభివద్ధి చెందిన దేశాలలో దక్షిణ కొరియా వైద్యుల-జనాభా నిష్పత్తి అత్యల్పంగా ఉందని అధికారులు చెబుతున్నారు.మెడికల్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచకుండా మెడికల్ సీట్లను ఇష్టానుసారంగా పెంచేయడం వల్ల వైద్య విద్య నాణ్యత పడిపోతుందనేది జూనియర్ డాక్టర్ల వాదన.



మీ కోసం

ప్రతిరోజూ బ్రష్ చేశాక చిగుళ్లపై వేళ్లతో మృదువుగా మసాజ్ చేసినట్టు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

జీవన సౌరభం

ఎవరెన్ని సలహాలు చెప్పినా శ్రద్ధగా వినాలి. అయితే, తుది నిర్ణయం మీదే కావాలి.

చక్రాలు



ముందుకు ఒకటి
వెనుకకు ఒకటి
సైకిల్ చక్రాలు

ముందుకు రెండు
వెనుకకు రెండు
కారుకు చక్రాలు

ముందుకు ఒకటి
వెనుకకు రెండు
ఆటో చక్రాలు

రెండు వైపుల
అటునిటు పెద్దవి
జట్కా చక్రాలు

కుమ్మరి సారెను
గిరగిర తిప్పగ
ఉండును ఒక చక్రం
దీపావళిలో


గిరగిర నేలను
తిరుగును భూచక్రం

మూడు రంగుల
మన జెండాలో
మధ్యన ఒక చక్రం

చదువెగ్గొడితే
పరీక్షలప్పుడు
తిరిగే బుర్ర చక్రం.. చక్రం..

- ఎన్.వి.ఆర్.సత్యనారాయణమూర్తి

చుక్కలు కలపండి



పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న అంకెలను వరుసగా చుక్కల మీదుగా కలిపితే, అందమైన బొమ్మ వస్తుంది. చూడండి.

నేను గీసిన బొమ్మ






దేవులపల్లి శ్రీ వర్ష,
ఒకటో తరగతి,
నంగునూర్, సిద్ధిపేట జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎండల వేళ.. జాగ్రత్త ఇలా..

వేసవి ప్రారంభంలోనే ఎండలు భయపెడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఉష్ణోగ్రతల ఉధృతి పెరుగుతోంది. ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా రోజువారీ పనులు చక్కబెట్టుకోవటం తప్పదు. కాబట్టి, వేడి నుంచి రక్షణ, ఉపశమనం పొందటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.





ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో సాధ్యమైనంతవరకు ఎండలో తిరగకుండా ఉండటమే మంచిదని నిపుణుల సూచన. ఒక వేళ తప్పనిసరై వెళితే చేతిలో గొడుగు లేదా తలకు టోపీ ధరించాలి. దిన చర్యల్లో కొన్ని మార్పులు చేసుకోవటం ద్వారా వేసవి సమస్యల నుంచి కొంతవరకైనా దూరంగా ఉండొచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి : ఎండలకు శరీరం డీ హైడ్రేషన్‌ను గురవుతుంది. తద్వారా శరీరానికి ఎక్కువ ద్రవాలు అవసరం. తరచూ మజ్జిగ, లస్సీ, మిల్క్ షేక్ మొదలైన పానీయాలను తీసుకుంటే కొంత ఉపశమనం పొందొచ్చు. ఉప్పు, చక్కెర కలిపిన ద్రావణాన్ని కూడా తాగొచ్చు. ఇది శరీరంలో నీటి లోపాన్ని తొలగించటానికి సహాయపడే ఎలక్ట్రోలైట్‌గా పనిచేస్తుంది. పుచ్చకాయలు, కొబ్బరి బోండాలు, దోస తరచూ తీసుకుంటే వాటిల్లోని నీరు, పోషకాలతోపాటు ఎలక్ట్రోలైట్స్ కూడా శరీరానికి అందుతాయి. పండ్లు నేరుగాగానీ, రసాల రూపంలో గానీ తీసుకుంటే శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. సాఫ్ట్‌డ్రింక్స్ తీసుకోవటం వల్ల అందులోని సోడియం, పంచదార వల్ల దాహం మరింత పెరుగుతుందేకాని తగ్గదు. పైగా వాటిలో ఇతరత్రా పోషకాలు ఉండవు. ఎండు ద్రాక్ష, కర్జూరం నాన బెట్టిన నీళ్లను తాగినా మంచిదే!



పులుపు పదార్థాలతో మేలు : విటమిన్ సి పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను ఈ కాలంలో తీసుకుంటే మంచిది. ఇవి శరీరాన్ని చల్లగా ఉంచటానికి దోహదపడతాయి. అధిక మొత్తంలో యాంటీ ఆక్సిడెంట్లు వీటిలో ఉంటాయి. తద్వారా సూర్యుని కఠినమైన కిరణాల నుంచి శరీరాన్ని రక్షించటానికి దోహద పడతాయి. విటమిన్ సి పుష్కలంగా ఉన్న ఆహారాన్ని తినటం వల్ల చర్మం సూర్య కిరణాలు, వాయు కాలుష్యంతో పోరాడటానికి సహాయపడతాయి.

తాజా కూరగాయలు : శరీరంపై సూర్యరశ్మి చెడు ప్రభావాలను నివారించటానికి, ఆకుపచ్చ కూరగాయలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. పాలకూర, పుదీనాలను తినటం వల్ల కాల్షియం, ఐరన్, పొటాషియం, నీరు ఎక్కువగా శరీరానికి అందుతాయి. కేరట్ వంటి పచ్చి కూరగాయలు తినటం ఎంతో మంచిది. వీటిలో కెరోటినాయిడ్ కంటెంట్ ఉంటుంది. వీటి ద్వారా శరీరంలో విటమిన్ ఎ ఉత్పత్తి అవుతుంది.

అరటి పండు, పెరుగు తీసుకోవాలి : వేసవిలో అరటిపండు, పెరుగు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పెరుగులో ప్రోబయోటిక్స్ ఉంటాయి. వీటి వల్ల కడుపు చల్లగా ఉంటుంది. వేసవిలో డయేరియా సమస్యలను తగ్గించటంలో అరటి పండు ఎంతగానే ఉపయోగపడుతుంది. ఇందులోని పీచు జీర్ణ వ్యవస్థను కూడా బలపరుస్తుంది.

మసాలాలు వద్దు : ఎండల నుంచి బాహ్య శరీరాన్ని ఎలా కాపాడుకుంటామో అలాగే అంతర్గత శరీరాన్ని కూడా అలాగే కాపాడుకోవటం ముఖ్యం. ఈ కాలంలో చాలా కారంగా, ఘాటుగా ఉండే మసాలాలలతో కూడా ఆహార పదార్థాలు తినకుండా ఉండటమే మేలు. ఇవి శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. అధిక ప్రొటీన్, చక్కెర ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది. పండ్ల రసాలు, కొబ్బరినీరు మొదలైనవి తరచూ తాగటం వల్ల చర్మ సంరక్షణకు కూడా మేలు జరుగుతుంది.

ఇవీ, పాటించండి!

- స్నానం చేసే నీటిలో కొన్ని చుక్కలు వెనిగర్‌ను వేస్తే చెమట వాసన ఉండదు.
- నిమ్మరసం ముఖానికి రాసుకుని ఓ అరగంట తర్వాత గోరు వెచ్చని నీటితో కడిగితే ముఖం స్వచ్ఛంగా ఉంటుంది.
- ఎండలో తిరిగే సమయంలో జుట్టును గుడ్డతో కవర్ చేయాలి. లేదంటే ఎండ వేడికి వెంట్రుకలు చిట్లిపోయి రంగు మారిపోయే ప్రమాదం ఉంటుంది.
- ఎండ కారణంగా జాగ్రత్తలు తీసుకోకపోతే చర్మం నల్లబడటం, దద్దుర్లు రావటం, మృదుత్వం కోల్పోవటం వంటి సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి ఒంటిని మొత్తం కప్పిఉండేలా కాటన్ దుస్తులు ధరించాలి.

కొబ్బరినీళ్లు ఆరోగ్యకరం



కొబ్బరినీళ్ళలో కాల్షియం, ఫాస్ఫరస్, సోడియం, పొటాషియం, మెగ్నీషియం లాంటి ఖనిజ లవణాలు ఉంటాయి. ప్రతిరోజూ గ్లాసు కొబ్బరినీళ్లు తాగితే ఎండలో శరీరం డీ హైడ్రేషన్ కాకుండా కాపాడుకోవచ్చు. కూల్‌డ్రింక్స్ కన్నా కొబ్బరినీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిది.

- కొబ్బరి నీళ్లల్లో దాహాన్ని తీర్చే గుణం ఉంది. వీటిలో ఉన్న వంటి ఖనిజ లవణాలు రక్తపోటుని అదుపులో ఉంచుతాయి. ఇందులోని ఎలక్ట్రోలైట్స్ తక్షణ శక్తిని నీరసం పోగొడుతుంది.
- తక్కువ కొవ్వులు ఉండే కొబ్బరినీళ్లను రోజూ తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది.
- గర్భిణులకు కొబ్బరి నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. ఇందులో ఉండే విటమిన్ బి9 కడుపులో బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతుంది. ఈ సమయంలో వచ్చే జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. కొబ్బరి నీళ్లు లారిక్ యాసిడ్‌ని ఉత్పత్తి చేయడం వల్ల తల్లిపాలు సమృద్ధిగా పడతాయి.
- కొబ్బరినీళ్లుఆరోగ్యాన్నే కాదు అందాన్ని పెంచుతాయి. కొబ్బరి నీళ్ళలో ఉండే విటమిన్ బి, విటమిన్ సి వల్ల మొటిమలు, బ్లాక్‌హెడ్స్, చర్మం కందిపోవడం, చర్మ సమస్య ఏదైనా సులువుగా పరిష్కరించుకోవచ్చు.
- క్రమం తప్పకుండా కొబ్బరి నీళ్ళను ముఖానికి రాసుకోవడం వల్ల మొటిమల వల్ల వచ్చే మచ్చలు క్రమేనా తగ్గిపోతాయి. చర్మం కూడా తాజాగా, అందంగా మారుతుంది.
- ఓ అధ్యయనం ప్రకారం కొబ్బరినీళ్ళలో యాంటీ ఏజింగ్ కారకాలు ఉంటాయి. ఇవి వయసును తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి.

సినిమాలకు ఊరి పేర్లతో స్థానిక సౌరభం!

ఊరి పేర్లతోనూ, గ్రామీణ నేపథ్యంలో వస్తున్న సినిమాలకు ఆదరణ పెరుగుతోంది. ఊరి పేరుకు తోక తగిలిస్తూ టైటిల్ పెట్టి తీస్తున్న సినిమాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానికతకు తోడు టైటిల్ భలే ఉందనే పేరుతో చాలామంది ఇలాంటి సినిమాలను ఆదరిస్తున్నారు. టైటిల్ కూడా కీ రోల్ పోషిస్తుండటంతో దర్శక నిర్మాతలు ఏరికోరి మరీ సినిమాలకు ఊరి పేర్లు పెట్టేస్తున్నారు. ఆయా సినిమాలు వైవిధ్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఊర్ల పేర్లతో వచ్చి మంచి విజయం సాధించిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. గతంలో పలు సినిమాలు వచ్చాయి. ప్రస్తుతం మరికొన్ని వస్తున్నాయి. ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, పలాస, బెదుర్లంక, రంగస్థలం, అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్, ఊరు పేరు భైరవకోన తదితర సినిమాలు వచ్చాయి. సింహాచలం, శ్రీశైలం, బద్రినాథ్, స్టువర్టుపురం పోలీస్‌స్టేషన్, బెజవాడ, ద్వారక, మాచర్ల నియోజకవర్గం వంటి సినిమాలు బాగానే ఆకట్టుకున్నాయి. మచ్చుకు కొన్ని సినిమాల గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం...









అంబాజీపేట మ్యారేజీ బ్యాండు : హీరో సుహాస్, హీరోయిన్ శివాని నగరం నటించిన ఈ సినిమాకు దుష్యంత్ కటికనేని దర్శకత్వం వహించారు. అంబాజీపేటలో 2007 నేపథ్యంలో కథ సాగుతుంది. బ్యాండ్ పార్టీలో పనిచేసే మల్లి, కోటీశ్వరుడైన వెంకట్ చెల్లెలుతో ప్రేమలో పడతాడు. అప్పటి పరిస్థితులను, ఎమోషన్స్‌ను దర్శకుడు బాగా చూపించారు.

ఊరు పేరు భైరవ కోన : హీరోగా సందీప్ కిషన్, హీరోయిన్లుగా వర్ష బొల్లమ్మ, కావ్య థాపర్ నటించారు. హీరో, అతని స్నేహితుడు ఒక దొంగతనం చేసి అనుకోకుండా భైరవకోనలోకి వస్తారు. వీరితోపాటుగా హీరోయిన్ కూడా ఊర్లోకి వస్తుంది. ఈ క్రమంలో అనేక ట్విస్టులు సాగుతాయి. అసలు ఈ భైరవకోనకూ, మిగతా ఊర్లకు తేడా ఏంటీ? అంటూ అసలు కథలోకి తీసుకెళ్తారు.

బెదురులంక : హీరో కార్తికేయ నటించిన చిత్రం ఇది. ఈ సినిమా షూటింగు ఎదుర్లంకలో జరిగింది. 2012లో ప్రపంచం అంతం అవుతుందని గ్రామ ప్రజలు భయపడుతున్న క్రమంలో గ్రామ పెద్ద ఇద్దరు నకిలీ దేవతలను సృష్టించి గ్రామస్తులను భయపెట్టి వారి నగలను దోచుకోవాలని ప్రయత్నిస్తాడు. గ్రామంలో శాంతిని నెలకొల్పటానికి హీరో ప్రయత్నిస్తాడు.



కేరాఫ్ కంచరపాలెం : విజయవాడకు చెందిన వెంకటేష్ మహాకు కంచరపాలెంతో అనుబంధం ఉంది. ఆయన దర్శకత్వంలో చక్కటి కథతో ఈ సినిమా రూపొందించాడు. తక్కువ బడ్జెట్‌తో 50 మంది స్థానికులతో ఈ సినిమా తీశారు. ప్రేక్షకులు బాగానే ఆదరించారు. న్యూయార్క్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చోటు దక్కించుకున్న తొలి తెలుగు చిత్రం ఇది.



భీమిలి : కబడ్డీ నేపథ్యంలో హీరో నాని నటించిన చిత్రం భీమిలి (కబడ్డీజట్టు). ఇందులో నాని కబడ్డీ టీం భీమిలికి చెందింది కావటంతో టైటిల్ పెట్టారు. ఈ సినిమా కూడా హిట్టయ్యింది.

పలాస : తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో సుధాస్ మీడియా పతాకంపై ధ్యాన్ అట్లూరి నిర్మాణ సారధ్యంలో కరుణకుమార్ దర్శకత్వంలో ఈ సినిమా వచ్చింది. రక్షిత్, నక్షత్ర, రఘు కుంచె తదితరులు నటించారు. 1978 ప్రాంతంలో అగ్ర కులాలవారు తమ స్వార్థం, రాజకీయ బలంతో అణగారిన వర్గాలను ఎలా అణచివేశారనే ఇతివృత్తంగా ఈ సినిమా సాగింది.

అన్నవరం : పవన్ కళ్యాణ్ హీరోగా ఈ సినిమా తీశారు. చెల్లికి తోడుండే అన్నయ్య క్యారెక్టర్‌లో ఆయన నటించారు. ఈ సినిమాలో పవన్ పేరు 'అన్నవరం'.

గంగోత్రి : అల్లు అర్జున్ తెరంగేట్రం చేసిన సినిమా ఇది. రాఘవేంద్రరావు దర్శకుడు. గంగోత్రి పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా నేపథ్యం ఉంటుంది. అందుకే ఆ పేరు పెట్టారు. హీరోయిన్ పేరు కూడా గంగోత్రి.

బొంబాయి : బొంబాయిలో మతకల్లోలాల్లో ఇరుగ్రూపుల మధ్య జరిగిన గొడవలు, రక్తపాతం, ప్రాణనష్టాలను ఈ సినిమాలో చూపించారు. మణిరత్నం దర్శకత్వం వహించిన ఈ సినిమాకు అదే సిటీ పేరుపెట్టారు.

అరుణాచలం : రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన చిత్రం. తమిళనాడులోని ప్రసిద్ధ క్షేత్రం కూడా అరుణాచలమే.


భద్రాచలం : హీరో శ్రీహరి నటించిన ఈ సినిమాను దర్శకుడు ఎన్.శంకర్ చేశారు. పట్టుదల ఉంటే సాధించొచ్చు అని చెప్పే కథ.

అనంతపురం : తమిళ సినిమాను తెలుగులోకి డబ్బింగ్ చేసి 'అనంతపురం' పేరు పెట్టారు. హనుమాన్ జంక్షన్ : ఏలూరుకి సమీపంలోని హనుమాన్‌జంక్షన్ పేరుతో కూడా సినిమా వచ్చింది. ఈ పట్టణం పేరుతో జగపతిబాబు, అర్జున్, వేణు హీరోలుగా నటించిన ఈ సినిమా మంచి విజయాన్ని కైవసం చేసుకుంది.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.. ఇలా చెప్పుకుంటూ చాలా సినిమాలే ఉన్నాయి. స్థానికత జోడించి సినిమాలకు పేర్లు పెట్టడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను ఆకట్టుకునేలా సినిమాలు వస్తున్నాయి. ఇప్పటికే ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తాంధ్ర ప్రాంతాల్లోని స్థానికత, భాష, యాసలను ఉపయోగిస్తూ సినిమాలు తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఈ తరహా సినిమాగా 'పుష్ప' పాన్ ఇండియా సినిమాగా నిలిచింది. తాజాగా నాగచైతన్య, రామ్‌చరణ్ ఉత్తరాంధ్ర నేపథ్యంతో సాగే సినిమాలపై దృష్టి సారించారు.

స్టార్ క్రికెటర్లు అక్కర్లేదు!

- యువ జట్టుతోనూ విజయాలు సాధించగలం
- లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ వ్యాఖ్యలు



ముంబయి : భారత క్రికెట్ దిగ్గజం, లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టెస్టు క్రికెట్‌లో భారత జట్టు లోతైన బెంచ్ బలంపై ప్రశంసలు కురిపిస్తూనే, అగ్ర క్రికెటర్లపై పదునైన వ్యాఖ్యలు చేశారు. క్రికెట్ జట్టుగా ఆడే క్రీడ. ఓ ఆటగాడిపై ఆధారపడేది కాదు. ఈ సంగతి తెలుసుకోవాలని చురకలు అంటించారు!. 'నేను ఎప్పుడూ చెబుతాను, జట్టులో అగ్ర క్రికెటర్ల అవసరం లేదు. ఎవరైనా అగ్ర క్రికెటర్ తను లేకుంటే జట్టు విజయం సాధించలేదని అనుకుంటే..2021 ఆస్ట్రేలియా సిరీస్, 2024 ఇంగ్లాండ్ సిరీస్‌లు అది నిజం కాదని చూపించాయి. అగ్ర క్రికెటర్లు జట్టులో ఉన్నా లేకపోయినా అది పెద్ద విషయమే కాదు. క్రికెట్ టీమ్ స్పోర్ట్. ఓ ఆటగాడిపై ఆధారపడదు' అని సునీల్ గవాస్కర్ అన్నాడు. 'స్వదేశంలో ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో జట్టును నడిపించిన తీరు అమోఘం. ఈ ఘనత కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు దక్కుతుంది. యువ క్రికెటర్లకు అవకాశాలు ఇచ్చారు, వెన్నుతట్టి మద్దతుగా నిలిచారు, సహజశైలిలో ఆడే స్వేచ్ఛ కల్పించారు. జట్టులో అగ్ర క్రికెటర్లు ఉన్నా లేకపోయినా.. పెద్ద మనసు కలిగిన ఆటగాళ్లతో సిరీస్ విజయం సాధించగలమని నిరూపించింది' అని గవాస్కర్ అన్నారు.

2020-21 ఆస్ట్రేలియా పర్యటనలో తొలి టెస్టులో భారత్ దారుణ ఓటమి చవిచూసింది. కెప్టెన్ కెప్టెన్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో స్వదేశం వెళ్లిపోగా.. రహానె సారథ్యంలోని యువ జట్టు గొప్పగా పుంజుకుంది. రిషబ్ పంత్, మహ్మద్ సిరాజ్ సీనియర్లు లేని వేళ రెచ్చిపోయారు. భారత్‌కు చారిత్రక టెస్టు సిరీస్ విజయం కట్టబెట్టారు. ఇక తాజా ఇంగ్లాండ్‌తో సిరీస్‌కు విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో దూరంగా ఉన్నాడు. గాయంతో కెఎల్ రాహుల్, మహ్మద్ షమి దూరమయ్యారు. అయినా, యువ ఆటగాళ్లు ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్ ఖాన్, ఆకాశ్ దీప్‌లు అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. హైదరాబాద్ టెస్టు ఓటమి నుంచి పుంజుకున్న టీమ్ ఇండియా వరుసగా విశాఖపట్నం, రాజ్‌కోట్, రాంచి టెస్టుల్లో విజయాలు సాధించింది. 3-1తో ఐదు మ్యాచుల టెస్టు సిరీస్‌ను సొంతం చేసుకుంది. భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌లో చివరి మ్యాచ్ గురువారం నుంచి ధర్మశాల వేదికగా జరుగనుంది.

ఎందుకో ఎవరికీ తెలియదు! : బీసీసీఐ కాంట్రాక్టు జాబితా నుంచి శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లను తప్పించటంపై సునీల్ గవాస్కర్ బోర్డుపై విమర్శలు చేశారు. 'బీసీసీఐ వార్షిక కాంట్రాక్టు క్రికెటర్ల జాబితా విడుదల చేసింది. రంజీ ట్రోఫీలో ఆడలేదని కారణంతో శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లపైయ వేటు వేశారని చెబుతున్నారు. కానీ ఇషాన్ కిషన్ ఎందుకు రంజీ టోర్నీలో ఆడటం లేదో ఎవరికీ తెలియదు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ముంగిట అయ్యర్ రంజీ ట్రోఫీలో ఆడాడు. దేశవాళీలో ఆడనని అయ్యర్ ఎన్నడూ అనలేదు. వెన్నునొప్పితో మూడో టెస్టులో ఆడలేనని అయ్యర్ ఫిజియోకు ఫిర్యాదు చేశాడు. ఎన్‌సీఏ వైద్య బృందం శ్రేయస్ ఫిట్‌నెస్‌కు క్లియరెన్స్ ఇచ్చారు. వైద్యుల క్లియరెన్స్ అయ్యర్‌పై ప్రతికూల ప్రభావం చూపించింది. ఓ ఆటగాడి గాయం నొప్పి ఏ ఫిజియో సైతం తీర్పు చెప్పలేడు' అని మిడ్‌డేకు రాసిన ఓ వ్యాసంలో సునీల్ గవాస్కర్ రాసుకొచ్చారు.

శార్దూల్ శతక జోరు

- ముంబయి తొలి ఇన్నింగ్స్ 353/9



ముంబయి : తమిళనాడు, ముంబయి రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ (109, 105 బంతుల్లో 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీతో చెలరేగాడు. టెయిలెండర్ తనుశ్ కొటియన్ (74 నాటౌట్, 109 బంతుల్లో 10 ఫోర్లు), హార్దిక్ తామోరె (35, 92 బంతుల్లో 3 ఫోర్లు) స్ఫూర్తిదాయక ఇన్నింగ్స్‌లతో రాణించారు. టాప్ ఆర్డర్‌లో యువ ఆటగాడు ముషీర్ ఖాన్ (55, 131 బంతుల్లో 6 ఫోర్లు) మినహా పృథ్వీ షా (5), బూపెన్ లాల్వాని (15), మోమిత్ అవస్తి (2), అజింక్య రహానె (19), శ్రేయస్ అయ్యర్ (3), శామ్స్ ములాని (0) విఫలమయ్యారు. దీంతో ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 106 పరుగులకే ఏడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుంది. ఈ దశలో హార్దిక్, తనుశ్ తోడుగా శార్దుల్ రెండు కీలక భాగస్వామ్యాలు నిర్మించాడు. ఠాకూర్ సెంచరీ ఇన్నింగ్స్‌తో ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 353/9 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో విలువైన 207 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. తమిళనాడు బౌలర్ సాయికిశోర్ (6/97) ఆరు వికెట్లతో చెలరేగాడు. తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

మెరిసిన హిమాన్షు మంత్రి

- పట్టు బిగిస్తున్న మధ్యప్రదేశ్



నాగ్‌పూర్ : మధ్యప్రదేశ్, విదర్భ రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో హిమాన్షు మంత్రి (126, 265 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) వన్‌మ్యాన్ షోతో అదరగొట్టాడు. యశ్ దూబె (1), హర్ష్ (25), శుభమ్ (1), వెంకటేశ్ అయ్యర్ (0) విఫలమైనా ఓ ఎండ్‌లో నిలబడిన హిమాన్షు బాధ్యతాయుత సెంచరీతో మధ్యప్రదేశ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. సాగర్ సోలంకి (26), జైన్ (30)లు హిమాన్షుకు సహకారం అందించారు. హిమాన్షు సెంచరీతో మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 94.3 ఓవర్లలో పది వికెట్లకు 252 పరుగులు చేసింది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకు కుప్పకూలగా.. మధ్యప్రదేశ్ 82 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో విదర్భ 13/1తో పోరాడుతుంది. విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో మరో 69 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68